ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

గురువారం | 08-10- 2026 | సంపుటి: 17, సంచిక: 187, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు



ఉద్యమం ఆగదు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ప్రజాస్వామ్యాన్ని పరిరక్షణకే పార్లమెంట్ వరకు పోరు
- దేశ ప్రజల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర
- మోడీ ఆదేశాల మేరకే ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది
- 'సైమన్ గో బ్యాక్' తరహాలో 'జీకే గో బ్యాక్' : సీఎం రేవంత్

న్యూఢిల్లీ, అక్టోబరు 7 : దేశ ప్రజల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు వర్గాలను సృష్టించే ప్రయత్నం జరుగుతోందని వాపోయారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తే.. ఆయనపై చర్యలు తీసుకోవడం దారుణమని రేవంత్ రెడ్డి అభిప్రా యపడ్డారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను అరెస్టు చేసిందని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని అన్నారు.

'సైమన్ గో బ్యాక్' తరహాలో 'జీకే గో బ్యాక్'

గతంలో 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు దేశంలో 'సర్ గో బ్యాక్', 'జీకే గో బ్యాక్' ఉద్యమం కొనసాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...



ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్

కౌన్సిల్ సమావేశం

- పెట్టుబడులను ఆకర్షించేందుకు సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, అక్టోబరు 7 (ప్రజాకలం) :

రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తరువాయి 2వ పేజీలో...



ప్రజల అభివృద్ధికి అందరి సమన్వయంతో కృషి

రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలి

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

మంచిర్యాల//ప్రజాకలం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7

ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎస్. ఈ. బానోత్ రాజన్న, మండల తహసిల్దార్ సతీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రికి మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సదుపాయాల విస్తరణ, రహదారుల అభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాల అమలు తదితర కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకు వెళ్ళవలసిన అవసరం ఉందని తెలిపారు. గ్రామంలో 33 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు ఎంతో ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమమని, సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమి కేటాయింపు విషయంలో కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, కొందరు గ్రామస్తులు భూమి విషయమై తమను

తరువాయి 2వ పేజీలో...

తెలంగాణ బలం.. యువత నైపుణ్యమే

ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, అక్టోబరు 7 (ప్రజాకలం) :

తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...



ఓట్, సీట్ చోరీ

పేటెంట్స్ కాంగ్రెస్ వే..

కేంద్ర మంత్రి

బండి సంజయ్ కుమార్

2



ఓటు విలువను కాపాడే రాహుల్ పోరాటాన్ని బారికేడ్లు ఆపలేవు

ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం బహిరంగ సమాధానాలు ఇవ్వాలి

ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారి ప్రశ్నలను అణచలేరు : మంత్రి ఉత్తమ్

ఎన్నికల పారదర్శకతపై దేశవ్యాప్త చర్చకు దారితీసిన రాహుల్ గాంధీకి అభినందనలు

2

పల్లెల్లోనే మెరుగైన వైద్యం..



- గ్రామీణులకు వైద్య సేవలు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్


మల్లాపూర్, అక్టోబర్ 7 (ప్రజాకలం ప్రతినిధి)

గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగా రావు తో కలిసి బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి,

తరువాయి 2వ పేజీలో...



కలం కౌంటర్



దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా

ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల మైలురాయిని పూర్తి చేసుకున్న మోదీ

ఈ స్థాయికి చేరుకుంటానని తాను ఎన్నడూ ఊహించలేదని వ్యాఖ్య

ప్రజల నిరంతర ఆశీర్వాదంతోనే ఇది సాధ్యమైందంటూ దేశ ప్రజలకు కృతజ్ఞతలు

ఢిల్లీ, అక్టోబర్ 7: దేశ ప్రజలే తనకు దైవ స్వరూపమని, వారి నమ్మకమే తన బలమన్న ప్రధాని2001 అక్టోబర్ 7న గుజరాత్ సీఎంగా మొదలైన ఆయన ప్రస్థానంప్రభుత్వాధినేతగా తాను నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకమే తనకు అతిపెద్ద బాధ్యత అని, తనపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ

తరువాయి 2వ పేజీలో...



జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదు

మొదటి పేజీ తరువాయి...

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. గతంలో రైతుల ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించినా... చివరకు ప్రజల ఒత్తిడికి తలొగ్గి చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు కూడా ఎంత మొండిగా వ్యవహరించినా జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పేర్కొన్నారు. అవసరమైతే ఈ వ్యవహారం మరింత ముందుకు వెళ్లి ప్రధాని రాజీనామా చేయాల్సిన పరిస్థితి కూడా వస్తుందని అన్నారు.

దేశ ప్రజల ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరు

భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను ఉపయోగించుకున్నారని, ఇప్పుడు నేరుగా ఎన్నికల సంఘాన్నే రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఓట్లను తొలగించి తమకు అనుకూలంగా ఎన్నికల ఫలితాలను మార్చే ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుంటుందని చెప్పారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పోలీసులు వ్యవహరించిన తీరును చూస్తే మోడీ, అమిత్‌షాల అసహనం స్పష్టంగా కనిపిస్తోందని సీఎం అన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, పదవులను కాపాడుకునేందుకు ప్రతిపక్ష నేతలపై పోలీసులను ప్రయోగిస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ ఉద్యమం కాదు ఇది... ప్రజల ఉద్యమం

దేశంలోని ప్రజలు జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజల హక్కులను కాలరాసిన వారికి చరిత్రలో ఎవరూ తప్పించుకోలేదని, చివరకు ప్రజల కోర్టులోనే తీర్పు ఎదుర్కోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్షాల డిమాండ్‌ను అంగీకరించి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగుతుందని సీఎం స్పష్టం చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే పరిమితమైన ఉద్యమం కాదని, ఇండియా కూటమి, ప్రజల ఉద్యమమని అన్నారు. ప్రజలు ఒక్కటై గొంతెత్తితే ప్రభుత్వం తప్పనిసరిగా వినాల్సిందేనని, లేకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగుతారని, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఎం తెలిపారు.

ప్రజల అభివృద్ధికి అందరి సమన్వయంతో కృషి

మొదటి పేజీ తరువాయి...

కలిసి విజ్ఞప్తి చేశారని, గ్రామ ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందరి సహకారంతో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని, ఈ క్రమంలో సుమారు 3 కోట్ల రూపాయల వ్యయంతో సబ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు అందించడంతో పాటు ఉచిత విద్యుత్ పథకాల ద్వారా పేదలపై ఆర్థిక భారం తగ్గిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,. గ్రామంలో 32 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇండ్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంజూరైన ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వ సహకారంతో ఇండ్ల నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పేద ప్రజలకు సామాజిక భద్రత కల్పించడంలో భాగంగా గ్రామానికి 38 పెన్షన్లు మంజూరయ్యాయని, అర్హులైన 38 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందనున్నాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగి మంచి ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలోహొహొ10 వేల మంది ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో ప్రత్యేక పాఠశాల ఏర్పాటు కానుందని, సిబిఎస్‌ఈ/రెసిడెన్షియల్ విద్యా సదుపాయాలతో సుమారు 2 వేల 500 మంది విద్యార్థులకు వసతితో కూడిన విద్యా సంస్థ ఏర్పాటు చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని, ఈ అవకాశాలను స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు 10 లక్షల రూపాయల వరకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సదుపాయం అందించడం జరుగుతుందని, చికిత్స ఖర్చులు పెరిగిన సందర్భాలలో పేదలపై భారం పడకుండా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు చిన్నచిన్న వైద్య అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లవలసిన పరిస్థితి లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గ్రామాలలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ఎం.ఎల్.ఎ. కాలనీ నుండి ఆర్‌కె-5 వరకు సుమారు 4.7 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి 4.85 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, రాబోయే రోజులలో గ్రామంలోని అన్ని ప్రాంతాలలో అవసరమైన రహదారులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాలలో రాత్రివేళ ప్రజలకు మెరుగైన వెలుతురు, భద్రత కల్పించేందుకు హైమాస్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాలను గుర్తించి దశలవారీగా హైమాస్ లైట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యువతకు స్థానికంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. డ్రైవింగ్ తదితర నైపుణ్యాలు కలిగిన యువత కొంతకాలం అనుభవం సంపాదించడంతో పాటు విదేశీ భాషలను నేర్చుకుంటే మంచి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, జర్మన్ భాషలో శిక్షణ అందించి, జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే సుమారు 70 మంది యువతకు జర్మన్ భాషలో శిక్షణ కొనసాగుతోందని, పలువురు 4 నెలలుగా శిక్షణ పొందుతున్నారని, మరో 3, 4 నెలలలో శిక్షణ పూర్తి చేసిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నస్పూర్ మండల కేంద్రంలో జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందిన వెంకటాపూర్ గ్రామస్థుల మృతికి సంతాపంగా మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మందమర్రి మున్సిపల్ పరిధిలోని 24 వార్డులకు సంబంధించి సుమారు 15 కోట్ల రూపాయల యు.ఐ.డి.ఎఫ్. నిధులతో 14వ వార్డులో అభివృద్ధి పనులకు మున్సిపల్ కమిషనర్ రాయలింగు తో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సుమారు 40 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు అమృత్ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు అందించే కార్యక్రమం కొనసాగుతుందని, పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు సి.సి. మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మందమర్రి పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, త్రాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబ డులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశిం చారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, TGIIC వీణ శశాంక, ITE&C సంయుక్త కార్యదర్శి అనుదీప్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ, ఎండీ, అజిత్ రెడ్డి, నిఖిల్ చక్రవర్తి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా

మొదటి పేజీ తరువాయి...

గొప్ప హక్కు ఉందని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప్ సభ'లో పాల్గొన్న మోదీ, ఈ చారిత్రక మైలురాయి సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, బీజేపీ జెండాలు ఊపుతూ 'భారత్ మాతా కీ జై', 'స్వాగత్ హై భాయ్ స్వాగత్ హై, మోదీజీ కా స్వాగత్ హై' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చాలామంది ఈ దృశ్యాలను తమ ఫోన్లలో బంధించేందుకు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ మైలురాయిని చేరుకుంటానని అస్సలు ఊహించలేదు. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంపై అపారమైన విశ్వాసం ఉన్న భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ, ఇతర రాజకీయ సహచరులందరికీ నా కృతజ్ఞతలు. దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలు ఏవైనా, గత 25 ఏళ్లుగా ప్రజలు నన్ను తమ సేవకుడిగా ఎంచుకున్నారు" అని తెలిపారు. "నాకు ప్రజలే దైవ స్వరూపం. లక్షలాది మంది దేశప్రజల నమ్మకం, కార్యకర్తల కష్టమే నాకు ఎప్పటికీ అతిపెద్ద బలం. ఈ దేశం నాకు ఎంతో ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత కూడా అతిపెద్దది. నాపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను" అని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ 25 ఏళ్ల ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈరోజు ఉదయం ఢిల్లీలోని సరోజినీ నగర్‌లో ఉన్న శ్రీ వినాయక మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యుల (ప్రజల) సంతోషం, శ్రేయస్సు, ఆరోగ్యం కోసం ప్రార్థించినట్లు ఆయన వివరించారు. 2001 అక్టోబర్ 7న కేశూభాయ్ పటేల్ స్థానంలో నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వినాశకరమైన భూజ్ భూకంపం అనంతర పరిణామాలు, రాజకీయ, పరిపాలనాపరమైన సవాళ్లతో రాష్ట్రం సతమతమవుతున్న క్లిష్ట సమయంలో ఆయన ఆ పదవిని అలంకరించారు. 2014 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి మూడుసార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ప్రధానమంత్రిగా మోదీ హయాంలో అంతర్జాతీయంగా భారత్‌కు గుర్తింపు గణనీయంగా పెరిగింది.

పల్లెల్లోనే మెరుగైన వైద్యం..

మొదటి పేజీ తరువాయి...

గ్రామీణ ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా గ్రామస్థాయిలోనే ప్రాథమిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. సాతారం ఆరోగ్య ఉపకేంద్రం ద్వారా ప్రాథమిక చికిత్స, ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు అందుతాయని పేర్కొన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందుగానే గుర్తించి నివారించడమే ముఖ్యమని మంత్రి అన్నారు. మహిళలు, గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులకు సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపకేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఈ కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు, డీఎంహెచ్‌వో సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్,మండల వైద్యాధికారి వాహిని,తహసీల్దార్ రాం చందర్,సర్పంచ్ పోతవేణి నారాయణ గౌడ్,ఉప సర్పంచ్ జగన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాట్లా సోమయ్య, రంగు రామాగౌడ్, యం ఎల్ హెచ్ పి సరిత, అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


తెలంగాణ బలం.. యువత నైపుణ్యమే

మొదటి పేజీ తరువాయి...

హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. "సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి" అని మంత్రి తెలిపారు. మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు. "హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. యువతలోని నైపుణ్యం, ప్రతిభే మన ప్రధాన బలం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. "ప్రపంచ సంస్థలు ఇక్కడ విస్తరించాలి. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది" అని చెప్పారు. డిఇ షా నియోపొలిస్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. హైదరాబాద్‌పై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక నమ్మకానికి ఇది మరో నిదర్శనమన్నారు. "నియోపొలిస్‌లో డిఇ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయం కేవలం మరో కార్యాలయం కాదు. హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ వృద్ధి ప్రయాణంపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసానికి ఇది బలమైన సంకేతం" అని శ్రీధర్‌బాబు అన్నారు. కొత్త కార్యాలయం ద్వారా హైదరాబాద్‌లో డీఈ షా కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. "ఈ విస్తరణను తెలంగాణ స్వాగతిస్తోంది. రానున్న రోజుల్లో డీఈ షా రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తుందని ఆశిస్తున్నాం" అని మంత్రి చెప్పారు. ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. "డిఇ షా నాయకత్వానికి నేను హామీ ఇస్తున్నాను. మీ వృద్ధి, విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇస్తాం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఓట్, సీట్ చోరీ పేటెంట్స్ కాంగ్రెస్ వే..

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



కరీంనగర్ : ఓట్ చోరీ, సీట్ చోరీ పేటెంట్ రైట్స్ కాంగ్రెస్ కే ఉన్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశంలో మొట్టమొదటి ఓట్, సీట్ చోరీకి పాల్పడిన ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని చెప్పారు. 1946లో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బ్రిటీష్ పాలకులు కాంగ్రెస్ కోరిన సమయంలో దేశంలోని ప్రదేశ కాంగ్రెస్ కమిటీలన్నీ తొలి ప్రధాని అభ్యర్థిగా పటేల్ పేరు ప్రతిపాదిస్తూ ఓట్లేస్తే ఒక్క పీసీసీ మద్దతు కూడా నెహ్రూను ప్రధాని చేసిన ఘనత కాంగ్రెస్ దేనని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీకి ఓట్, సీట్ చోరీకి పాల్పడాల్సిన కర్మ లేనేలేదన్నారు. ఆయనకు కుటుంబమే లేదని, బ్యాంకు బ్యాలెన్స్, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు అవసరమే లేదన్నారు. ప్రధాని పదవి నుండి దిగిపోయిన వెంటనే జబ్బకు సంచి తగిలించుకుని సామాన్యుడిలా ప్రజా సేవలో తరించే మహనీయుడు మోదీ అని అభివర్ణించారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుండి హౌజింగ్ బోర్డు కాలనీ పదవ చౌరస్తా వరకు 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప సభకు భారీ ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, బీజేపీ జాతీ అధ్యక్షుడు నితిన్ నబిన్ వర్చువల్ గా ప్రసగించి కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. ఈ కార్యక్రమం అనంతరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి శాంతి కుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు.

:దేశం కోసం, ప్రజల కోసం 25 ఏళ్ల ప్రజా సేవను గుర్తుగా సేవా జ్యోతి నిర్వహించాం. మోదీ దేశానికి చిరకాలం సేవలందించాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. ప్రతి పేదింట్లో వెలుగులు నింపడం ద్వారా దేశాభివృద్ధి సాధించేలా మోదీ శ్రమిస్తున్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ నిర్విరామంగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ సహా కొన్ని రాజకీయ మాటలు విని మోసపోయిన యువకులకు నా విజ&ప్తి.మోదీ రాజకీయ నేపథ్యం, చరిత్ర, ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకోండి. మోదీ లేని భారత్ ను ఊహించలేం. స్వార్థం వీడి దేశం కోసం ఆలోచించండి. 2014కు ముందు నేడు భారత్ ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో ఆత్మ విమర్శ చేసుకోండి.మోదీకి సొంత కుటుంబం లేదు దేశ ప్రజలే ఆయన కుటుంబం. ఆయనకు డబ్బులు, బినామీ ప్రాపర్టీలు అవసరమే లేదు. దేశ సేవే ఆయన లక్ష్యం. ప్రధాని పదవి నుండి దిగిపోయినా జబ్బకు సంచి వేసుకుని ప్రజాసేవలో తరించే మహనీయుడు మోదీ. మోదీకి ఆయురారోగ్యాలు అందించాలని సేవా జ్యోతి నిర్వహించాం.

ఓటు విలువను కాపాడే రాహుల్ పోరాటాన్ని బారికేడ్లు ఆపలేవు

ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం బహిరంగ సమాధానాలు ఇవ్వాలి

ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారి ప్రశ్నలను అణచలేరు

ఎన్నికల పారదర్శకతపై దేశవ్యాప్త చర్చకు దారితీసిన రాహుల్ గాంధీకి అభినందనలు

హైదరాబాద్, అక్టోబర్ 7: "ప్రజల ఓటు విలువను కాపాడాలంటూ రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని పోలీసు బారికేడ్లతో ఆపలేరు. ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారు లేవనెత్తిన ప్రశ్నలు మాయమైపోవు. సమాధానం కోసం నిలబడిన గొంతును అడ్డుకుంటే, ఆ ప్రశ్న మరింత బలంగా దేశమంతటా ప్రతిధ్వనిస్తుంది," అని నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.



ఎన్నికల పారదర్శకత కోసం దృఢంగా నిలబడి, ప్రతిపక్ష నిరసనకు నాయకత్వం వహించిన రాహుల్ గాంధీకి ఆయన అభినందనలు తెలిపారు. ఢిల్లీలో ఎన్నికల సంఘం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య జవాబుదారీతనంపై మరింత చర్చకు దారితీసిందని ఉత్తమ్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై వివరణ కోరుతున్న నాయకులను అడ్డుకున్న దృశ్యాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయని అన్నారు. "బారికేడ్ల ఎత్తుతో ప్రజాస్వామ్య బలాన్ని కొలవలేరు. ప్రజల సందేహాలకు ఇచ్చే సమాధానాల స్పష్టతలోనే వ్యవస్థల బలం కనిపిస్తుంది," అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతలకు అనుగుణంగా పూర్తి నిష్పాక్షికతతో వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు. "రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను నిలబెట్టేది అధికార దర్పం కాదు; ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నిర్ణయాల్లో పారదర్శకత, అభ్యంతరాల పరిశీలనలో నిజాయితీ, సమాధానాల్లో స్పష్టత ఉండాలి. సంస్థను ప్రశ్నించడం దాని ప్రతిష్ఠను దెబ్బతీయడమంటూ భావించే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం," అని అన్నారు. ఓటర్ల జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను రాజకీయ విమర్శలంటూ కొట్టిపారేయడం సరికాదని ఉత్తమ్ పేర్కొన్నారు. "అర్హుడైన ఒక్క పౌరుడి పేరు అన్యాయంగా తొలగినా, అది ఆ వ్యక్తి హక్కుకు జరిగిన నష్టం. అలాంటి అభ్యంతరాన్ని చిన్న విషయంగా తీసుకునే అవకాశం ఎవరికీ లేదు. జాబితాల సవరణకు అనుసరించిన ప్రమాణాలు, పేర్ల తొలగింపునకు కారణాలు, అభ్యంతరాల పరిష్కార విధానం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. ఆధారాలతో లేవనెత్తిన ఆరోపణలను నిష్పాక్షికంగా పరిశీలించి, ఆ పరిశీలన ఫలితాలను బహిరంగంగా వెల్లడించాలి," అని డిమాండ్ చేశారు. ఓటు చోరీ ఆరోపణలను దేశవ్యాప్త చర్చలోకి తీసుకురావడంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. "సామాన్యుడి చేతిలోని ఓటు అతడి ఆత్మగౌరవానికి ముద్ర. పాలకులను ఎన్నుకునే అతడి స్వేచ్ఛకు ఆయుధం. ఆ ఓటుపై అనుమానపు నీడ పడితే ప్రజాస్వామ్య పునాదులే దెబ్బతింటాయి." ప్రతి ఓటుకూ విలువ ఉండాలని, ప్రతి అర్హుడూ తన ఓటు హక్కును వినియోగించుకోవాలని రాహుల్ గాంధీ పట్టుబడుతున్నారని పేర్కొన్నారు. ఈ లక్ష్యంతో ఆయన చేస్తున్న పోరాటం దేశ ప్రజలందరికీ సంబంధించినదని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే హక్కు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఉందని ఉత్తమ్ అన్నారు. "ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత నుంచి పాలకులు తప్పించుకోలేరు. విమర్శలను అవహేళన చేయడం, ప్రశ్నించే వారిపై రాజకీయ దాడులకు దిగడం ద్వారా సందేహాలు తొలగవు. ప్రజల తీర్పుతో ఏర్పడే ప్రభుత్వాల విశ్వసనీయతను కాపాడాలంటే, ఆ తీర్పు వెలువడే ఎన్నికల ప్రక్రియపై పూర్తి నమ్మకం ఉండాలి," అని పేర్కొన్నారు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలపై పట్టుదలగా ప్రశ్నించడం రాహుల్ గాంధీ నాయకత్వంలో కనిపించే లక్షణమని మంత్రి అన్నారు. 2016లో పెద్ద నోట్ల రద్దుతో పేదలు, చిన్న వ్యాపారులు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారని గుర్తుచేశారు. 2020 మార్చిలో కోవిడ్ కారణంగా పొంచి ఉన్న తీవ్రమైన ఆర్థిక దెబ్బపై హెచ్చరించారని, లడఖ్ సరిహద్దు పరిణామాలపై దేశానికి స్పష్టత ఇవ్వాలని పదేపదే కోరారని అన్నారు. ప్రజల ఆందోళనలను అధికార వ్యవస్థల ముందుంచడంలో ఆయన చూపిన పట్టుదల ఇప్పుడు ఎన్నికల పారదర్శకత పోరాటంలోనూ కనిపిస్తోందని పేర్కొన్నారు.

పోషణ మాసంలో ఘనంగా శ్రీమంతాలు, అన్నప్రాసన

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 7 (ప్రజా కలం) పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా కోరుట్ల లోని బిలాల్ పుర, బాలాజీ రోడ్‌లో బుధవారం గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.



ఈ సందర్భంగా ముగ్గురు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు నిర్వహించగా, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ టేకుల శిరీష, తల్లులు, చిన్నారులు, అంగన్వాడీ టీచర్లు సాయిశ్వరి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ట్రాలీ యూనియన్ కిరాయి పెంపు



బెల్లంపల్లి, అక్టోబర్ 7, (ప్రజాకలం) ప్రతినిధి.. బెల్లంపల్లి పట్టణ ఆటో ట్రాలీ యూనియన్ పిలుపు మేరకు పట్టణంలో బుధవారం టాటా ఏసి, మినీ ట్రాలీ డ్రైవర్, ఓనర్స్ బంద్ పాటించారు. నిత్యవసర ధరలు ఆకాశం అంటుతున్నాయని పాత కిరాయిల ద్వారా రోజు గడవడమే చాలా కష్టమవుతుందని ఆటో ట్రాలీ యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. కిరాయి పెంపుతో తమపై భారం తగ్గుతుందని ఈ మేరకు ట్రాలీ యూనియన్ సమావేశంలో రేట్లు పెంచినట్లు వివరాలను వెల్లడించారు. లోకల్ ట్రిప్ మినీ ట్రాలీ పాత రేటు 250 కొత్త రేటు 300, పెద్ద బండి పాత రేట్ 400 కొత్త రేటు 500, పెద్ద గూడ్స్ బండి పాత 800 కొత్తది రూ. 1000, ప్యాసింజర్ ఆటోలో గూడ్స్ ని తరలిస్తూ తమ పొట్ట కొట్టవద్దని యూనియన్ సభ్యులు వేడుకున్నారు. కొత్త రేట్ల పెంపుకు ప్రజలు తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు అంజన్న, రవికుమార్,శేఖర్, రాకేష్, సంతోష్, రాజు, సత్తి, రమేష్, నరేందర్, రాజేష్, అంజి, అమ్జద్ ఖాన్, రవి తదితరులు పాల్గొన్నారు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా
బైండ్ల శ్రీకాంత్ నియామకం



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్0 7(ప్రజా కలం ప్రతినిధి)

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన బైండ్ల శ్రీకాంత్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజెంగి నందయ్య. నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ తక్షణమే బాధ్యతలు. స్వీకరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించేందుకు సహకరించిన టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావుకు శ్రీకాంత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని.ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని శ్రీకాంత్ తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు

మెట్ పల్లి ఎల్ఐసీ ఏజెంట్ సంఘం
నూతన కార్యవర్గం ఏకగ్రీవం



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 07 (ప్రజాకలం): ఎల్ఐసీ ఏజెంట్ సంఘం 1964 యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగభూషణం, కార్యదర్శిగా మర్రి భాస్కర్, కోశాధికారిగా వాసాల వినయ్ ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా లియాఫీ 1964 సెంట్రల్ సెక్రటరీ ఎస్‌బీ శ్రీనివాస చారి, కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు బోయినపల్లి ప్రభాకర్ రావు, ఆల్ ఇండియా లీగల్ కమిటీ చైర్మన్ గట్టు రాజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను వెంటనే పరిష్కరించుకోవడంతో పాటు, ప్రజలకు ఎల్ఐసీ అందిస్తున్న సేవలు, సంస్థ ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించి, నియామక పత్రాలను అందజేశారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎల్ఐసీ ఏజెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ట్రెజరర్ శ్రీరామ్, జోనల్ రెసిడెన్సీ సెక్రటరీ వెంకట్ రెడ్డి, డివిజన్ సెక్రటరీ గంధం వెంకటేశ్వర్లు, డివిజన్ ట్రెజరర్ ఉత్కం వెంకట్ గౌడ్, మిట్టపల్లి మల్లారెడ్డి, గురుడు రాజగంగారం తదితరులు పాల్గొన్నారు. సుమారు 400 మంది ఎల్ఐసీ ఏజెంట్లు కార్యక్రమానికి హాజరయ్యారు

భవన నిర్మాణ అనుమతుల్లో కొత్త విధానం

"బిల్డ్‌నౌ"తో లైసెన్సుల జారీ.. - అక్టోబర్ 31లోగా డిజిటైజేషన్ తప్పనిసరి

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 7 (ప్రజాకలం)

నిర్మాణ అనుమతుల ప్రక్రియను మరింత పారదర్శకంగా, ఆన్‌లైన్ విధానంలో నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కొత్త పోర్టల్ ద్వారా లైసెన్స్ టెక్నికల్ పర్సనల్ ఎంప్యానెల్డ్ థర్డ్ పార్టీల రిజిస్ట్రేషన్, లైసెన్సుల జారీకి ఆన్‌లైన్ మాడ్యూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు అక్టోబర్ 1న జారీ చేసిన సర్క్యులర్ మెమో ప్రకారం కొత్తగా లైసెన్స్ పొందాలనుకునే అర్హత కలిగిన సాంకేతిక నిపుణులు నిర్ణీత రుసుము చెల్లించి పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే చెల్లుబాటయ్యే లైసెన్సులు కలిగిన వారు ఎలాంటి రుసుము చెల్లించకుండా తమ వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి డిజిటైజ్డ్ లైసెన్స్ పొందడం తప్పనిసరి.

అక్టోబర్ 31 వరకు గడువు

ప్రస్తుతం ఉన్న లైసెన్సుల డిజిటైజేషన్‌కు అక్టోబర్ 31, 2026 వరకు మాత్రమే అవకాశం కల్పించారు. ఆ తర్వాత మాన్యువల్ దరఖాస్తులను స్వీకరించరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. డిజిటైజ్డ్ లైసెన్స్ లేకుండా నిర్మాణ అనుమతి దరఖాస్తులను ఆమోదించరాదని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఇకపై కొత్త, రెన్యూవల్ లైసెన్సులు కేవలం ఆన్‌లైన్ విధానంలోనే జారీ చేయాలని మున్సిపల్ అధికారులు, పట్టణాభివృద్ధి సంస్థలకు సూచించింది.

థర్డ్ పార్టీలకు తనిఖీ బాధ్యతలు

జీఓ ఎంఎస్ నంబర్ 229, సెప్టెంబర్ 1, 2026 ప్రకారం ఎంప్యానెల్డ్ థర్డ్ పార్టీలకు కూడా కీలక బాధ్యతలు అప్పగించారు. ఆమోదిత లేఅవుట్లలో 500 చదరపు మీటర్లలోపు ప్లాట్ ఏరియా, 10 మీటర్లలోపు ఎత్తు కలిగిన వ్యక్తిగత నివాస భవనాలకు సంబంధించిన పోస్ట్ వెరిఫికేషన్, తనిఖీ నివేదికలను వీరు పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే 300 చదరపు మీటర్ల వరకు ప్లాట్ ఏరియా, 10 మీటర్లలోపు ఎత్తు ఉన్న భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ కోసం తనిఖీ నివేదికలను సమర్పించాలి. ఈ నివేదిక ఆధారంగా మున్సిపల్ కమిషనర్ పేరుతో ఓసి ను ఆమోదించడం లేదా తిరస్కరించడం జరుగుతుంది.అయితే 200 చదరపు మీటర్ల వరకు ప్లాట్ ఏరియా, 7 మీటర్ల వరకు ఎత్తు ఉన్న వ్యక్తిగత భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ పొందడం ఐచ్ఛికంగా



ప్రభుత్వం పేర్కొంది.

ఆన్‌లైన్ విధానంతో అక్రమాలకు చెక్.?

నిర్మాణ అనుమతులు, సాంకేతిక నిపుణుల లైసెన్సులు, తనిఖీల ప్రక్రియను ఆన్‌లైన్‌లోకి తీసుకురావడం ద్వారా పారదర్శకత పెంచడంతో పాటు మాన్యువల్ వ్యవస్థలో తలెత్తే అవకతవకలకు అడ్డుకట్ట వేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది.

కొత్త నిబంధనలతో భవన నిర్మాణాలు కఠినతరం

భవన నిర్మాణాల అనుమతుల విషయంలో ప్రభుత్వం కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురావడంతో నిర్మాణ ప్రక్రియ మరింత కఠినతరం కానుంది. నిర్మాణానికి ముందే అవసరమైన అనుమతులు, నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించి చేపట్టే నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీంతో భవన యజమానులు, నిర్మాణదారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొత్త నిబంధనలతో అక్రమ నిర్మాణాలకు చెక్

కొత్త భవన నిర్మాణ నిబంధనలతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడనుంది. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడం, నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మించడం, అనుమతించిన ప్లాన్‌లో మార్పులు చేయడంపై అధికారులు కఠినంగా వ్యవహరించనున్నారు. నిర్మాణాలకు ముందే నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవడంతో పాటు, ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తప్పవని అధికారులు చెబుతున్నారు. ఇకపోతే అక్రమ నిర్మాణాలు చేపడితే మున్సిపల్ అధికారులు తీసుకునే చర్యలను అడ్డుకోవడం లేదంటే ప్రత్యక్ష దాడులకు దిగడం వంటివి ఇకపై సాగవనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష

- భారత ఎన్నికల కమిషన్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్

ధర్మారం, అక్టోబర్ 07 : (ప్రజా కలం ప్రతినిధి) గాంధీ భవన్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యం లో సత్యాగ్రహ దీక్ష భారత ఎన్నికల కమిషన్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సత్యాగ్రహ దీక్ష చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమం లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బొల్లి స్వామి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ముగ్గురు అధికారులు ఉంటారు కానీ ఈ ముగ్గురు అధికారుల నుండి సర్ నివేదికను ఇద్దరు అధికారులు కేంద్ర ప్రభుత్వం సర్ అమలు చేయండి అని కేంద్ర ఎన్నికల కమిషన్ ను కోరగా దీనిని ముగ్గురు అధికారుల్లో ఇద్దరు వ్యతిరేకించిన దీనికి ఒక అధికారి ప్రభుత్వానికి లొంగి దేశ పౌరులకు ఓటు హక్కు అంబేద్కర్ రాజ్యాంగం లో ఇచ్చిన హక్కులను బీజేపీ రాజ్య విరుద్ధంగా దొంగ ఓట్లు ఉన్నాయనే నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ల పేర్లు తొలగించి ఈవీఎం ల మోసం వలన గెలుచు కుంటూ దొడ్డి దారిన అక్రమ ఓట్లతో గెలుస్తూ ప్రజల హక్కు అయినా ఓటు హక్కుకు భంగం చేస్తూ రాజ్యాంగాన్నీ కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వశే రాజ్యాంగ విరుద్ధ పనులు చేస్తూ పౌరులను అణిచివేస్తూ వారి హక్కులని భంగం చేస్తున్నారు ఓట్ల సవరణ పేరుతో జరుగుతున్న సర్ ప్రక్రియ అమలు తీరు రాజ్యాంగ గుండెలను బల్లెంతో పొడిచినట్లు ఉందని సుప్రీంకోర్టు జడ్జి ఉజ్జల్ బుమాన్ అన్నారు. నల్సార్




యూనివర్సిటీ ప్రధాన ఉపన్యాసం చేస్తు ఆయన ఘాటైన వాక్యాలు చేశారు ప్రశ్న అడిగితే సమాధానం చెప్పకుండా ప్రశ్నకు విమర్శను స్పందించే విధానం మంచిది కాదని కేంద్ర ప్రభుత్వానికి సూచన చేశారు. లక్షల కోట్ల మంది ఓట్లను ఏక పక్షంగా తొలగించడం దీనిని కూడా వ్యతిరేకమైన రాజ్యాంగ సవరణ ద్వారా చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

సర్ ప్రక్రియ నేరుగా రాజ్యాంగ స్ఫూర్తికి ప్రజా స్వామ్య విలువలను కూల్చే విధంగా తయారు చేసింది అన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వశే ఏం సమాధానం చెప్తుంది వెంటనే ఎన్నికల అధికారిని తొలగించాలని దీనికి బాధ్యత వహించి ప్రధాని నరేంద్రమోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని ఎన్నికలకు ఈవీఎం ల ద్వార కాకుండా బ్యాలెట్ ద్వారా ఎన్నికలు పాత పద్ధతి ద్వారా నిర్వ హించాలని డిమాండ్ చేశారు.

రచ్చపల్లి ఎస్సీ కాలనీకి డ్రైనేజీ
మంజూరు చేయాలని మంత్రికి వినతి

- బతుకమ్మ చెరువు సెంట్రల్ లైట్స్ పోల్లను మంజూరు కొరకు

ధర్మారం, అక్టోబర్ 07 : (ప్రజా కలం ప్రతినిధి) మండలం లో రచ్చపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు రూ.5 లక్షల నిధులు మంజూరు చేయాలని గ్రామస్తుల ఆధ్వర్యం లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కలిసి మంత్రికి వినతి పత్రం సమర్పించారు. కాలనీ లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మాలబోరు వైపు నుంచి వచ్చే వర్షపు, వరద నీరు ఎస్సీ కాలనీ లోకి చేరి బురుద మయంగా మారుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీరు రోజుల తరబడి నీరు నిలిచిపోవడం తో పారిశుధ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, దోమల బెడదతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. తక్షణమే డ్రైనేజీ నిర్మాణం చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం



చూపాలని గ్రామస్తులు కోరారు. అదేవిధంగా బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామ మహిళలు పెద్ద సంఖ్య లో చెరువు వద్దకు చేరుకుంటారని, సద్దుల బతుకమ్మను చెరువు లో నిమజ్జనం చేసే సమయం లో సరైన వెలుతురు లేక పోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయని గ్రామస్తులు తెలిపారు. మహిళల సౌకర్యార్థం బతుకమ్మ చెరువు వద్ద సెంట్రల్ లైట్స్ పోల్లను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. రచ్చపల్లి ఎస్సీ కాలనీ గ్రామ ప్రజల సమస్యల పై ఎస్సీ కాలనీ డ్రైనేజీ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయడం తో పాటు బతుకమ్మ చెరువు వద్ద సెంట్రల్ లైట్స్ పోల్లను ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధికి సహక రించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ను గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు సొల్లు సునీత--ఓదెలు, ఎనగందుల చంద్రమౌళి, భీమారపు లక్ష్మి, మాజీ వార్డు సభ్యురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యపై తక్షణ స్పందన



అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు హామీ
ఏఈ కి రైతుల కృతజ్ఞతలు

మెట్ పల్లి రూరల్ ,అక్టోబర్ 08 (ప్రజా కలం):మెట్‌పల్లి మండలం కోండ్రికర్ల గ్రామంలోని దుబ్బ ప్రాంతంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక భారం పడటంతో తరచూ ఫ్యూజులు కొట్టేయడం, ట్రిప్పింగ్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో సుమారు 26 పంపుసెట్ల మోటార్లు ఉండటంతో ఓవర్‌లోడ్ సమస్య ఏర్పడుతోందని రైతులు తెలిపారు. సమస్యను రైతులు విద్యుత్ ఏఈ రవి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించి, రైతుల ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఏఈ రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానోత్సవం విజయవంతం



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 7 (ప్రజాకలం): కోరుట్ల నియోజకవర్గంలోని మెట్‌పల్లి పట్టణం వాసవి గార్డెన్స్‌లో నాలుగు రోజులపాటు నిర్వహించిన హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానోత్సవం ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్, జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు లింబాద్రి క్రమం తప్పకుండా పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ జోనల్ కోఆర్డినేటర్, రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ శాస్త్రి పాల్గొని ధ్యాన విధానాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందే ధ్యానం చేయడం ద్వారా మనసుకు ప్రశాంతత, మంచి నిద్ర, సరైన అవగాహన కలుగుతాయని తెలిపారు. హార్ట్‌ఫుల్‌నెస్‌లో ధ్యానం, క్లీనింగ్ విధానాలతో పాటు ప్రాణాహుతితో కూడిన ధ్యానం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్ మంచాల కృష్ణ, కాన్హా జోనల్ కోఆర్డినేటర్ ప్రదీప్, ప్రిసెప్టర్లు దారం గోపి, రాజగోపాల్‌తో పాటు అభ్యాసులు అల్లకట్టు సత్యనారాయణ, పడిగేల శ్రీనివాస్, దొంతుల పవన్‌కుమార్, మహాజన్ నవీన్, పెండెం శివానందం, కోటగిరి ఆనందం, గాజెంగి రమేశ్, కె. విశ్వప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, హన్మాండ్లు, శివ, వేణు, జగన్, లక్ష్మీ, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య

మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు రావు, మండల విద్యాధికారి, గ్రామ సర్పంచ్ ఫయాజ్ లతో కలిసి సందర్శించి పాఠశాలలోని తరగతి గదులు, రిజిస్టర్లను తనిఖీ చేసి పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేసే పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని, ప్రతి విద్యార్థి విద్యా పురోగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక బోధన అందిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పర్యవేక్షించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం సకాలంలో అందేలా సంబంధిత అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జికి ఇరువైపుల గల రోడ్డు నిర్మానానికి
రైతులు సహకరించాలి..

జిల్లా అదనపు కలెక్టర్ రాజ గౌడ్

వెల్గటూర్, సెప్టెంబర్ 7, ప్రజాకలం, ప్రతినిధి :

వెల్గటూర్ గ్రామ శివారులో పెద్ద వాగు పై నూతనంగా నిర్మించిన బ్రిడ్జికి ఇరు వైపుల గల రోడ్డు నిర్మాణ పనులు సాఫీగా సాగేందుకు రైతులు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజ గౌడ్ అన్నారు. బుధవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి బ్రిడ్జి పరిసర ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. కాగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాబడిన, దానికి రెండు వైపుల గల రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. గతంలో ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం జరిపే సమయంలో అక్కడి రైతుల వద్దనుంచి భూమిని తీసుకోగా, ఎకరం ఏడు గుంటల భూమికి ఇప్పటికి నష్టపరిహారం కొంత మంది నిర్వాసితులకు అందలేదని తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనల ప్రకారం తొందరలోనే పూర్తి స్థాయి నష్ట పరిహారం అందజేస్తామని తెలిపారు. బ్రిడ్జికి రెండు వైపుల రహదారిని నిర్మించేందుకోసం సహకరించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజా కలం
గురువారం, అక్టోబర్ 8, 2026

ఆందోళన కల్గిస్తున్న యువకుల మరణాలు

ఇటీవల కాలంలో పురుషుల మరణాలు పెద్ద సంఖ్యలో చోటుచేసుకుంటున్నాయని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. మహిళలతో పోలిస్తే పురుషుల మరణాలు ఆందోళనకర రీతిలో పెరుగుతున్నట్లు పేర్కొంది. ముఖ్యంగా 15 నుంచి 64 ఏళ్ల మధ్య వయసు గల పనిచేసే, కుటుంబాలను పోషించే వయస్సు ఉన్న పురుషులలో ఈ తేడా అత్యంత తీవ్రంగా ఉందని తెలిపింది. నివేదిక ప్రకారం.. తమిళనాడులో గతేడాది నమోదైన మొత్తం మరణాల్లో 4,01,860 పురుషులు కాగా, 2,91,347 మహిళలు ఉన్నారు. మహిళల కంటే పురుషుల మరణాలు ఏకంగా 1,10,513 ఎక్కువ. గత మూడేళ్లుగా పురుషులు, మహిళల మరణాల మధ్య వ్యత్యాసం లక్షకు పైగానే ఉండటం గమనార్హం. 2023లో 1.10 లక్షలు, 2024లో 1.07 లక్షలు, 2025లో 1.11 లక్షలు.వీరిలో దాదాపు 86 శాతం (94,792 మరణాలు) తమ జీవితంలో అత్యంత కీలకమైన ఉత్పాదక దశలో ఉన్నవారే కావడం మరింత ఆందోళనకరం. ప్రజారోగ్య శాఖ డైరెక్టరేట్ ఓ మెడికల్ జర్నల్‌లో ప్రచురించిన 2018-2022 మధ్య పౌర నమోదు వ్యవస్థ డేటా విశ్లేషణ ప్రకారం.. ప్రతి జిల్లాలో 15 ఏళ్ల వయస్సు దాటినవారిలో మహిళల కంటే పురుషుల మరణాలే ఎక్కువగా ఉన్నాయని తేలింది.నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ టి. సుందరరామన్ మాట్లాడుతూ.. ఈ గణాంకాలు కేవలం జనాభాకు సంబంధించినవి మాత్రమే కాదని అన్నారు. “చాలా చిన్న వయసులో కుటుంబాలు తండ్రులను కోల్పోతున్నాయి. మహిళలు వితంతువులవుతున్నారు. యువత జీవితాలను కాపాడటానికి మనం పెట్టుబడులు పెట్టాలి” అని ఆయన అన్నారు.గతేడాది 15 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 9,167 మంది, మహిళలు 4,461 మంది ప్రాణాలు కోల్పోయారు. 25 – 34 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 17,135, మహిళలు 6,177.. 35 – 44 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 31,585, మహిళలు 11,406 మంది, 45 – 54 ఏళ్ల మధ్య మహిళల కంటే పురుషుల మరణాల సంఖ్య 28,474 ఎక్కువ. 55 – 64 ఏళ్లలో మహిళల కంటే 30,475 మరణాలు ఎక్కువ కాగా.. 70 ఏళ్లు దాటిన తర్వాత ఈ వ్యత్యాసం తగ్గింది. పురుషులు 1,55,093 మంది చనిపోతే.. మహిళలు 1,50,545 మంది ప్రాణాలు కోల్పోయారు.ప్రజా ఆరోగ్య నిపుణుల విశ్లేషణ ప్రకారం పురుషుల మరణాలకు యువతలో ప్రమాదాలు, ఆత్మహత్యలు: రోజుకు సగటున 50 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లోనూ, అంతే సంఖ్యలో ఆత్మహత్యల వల్ల మరణిస్తున్నారు. గుండె జబ్బులు, పక్షవాతం, కిడ్నీ వైఫల్యం, మధుమేహం, శ్వాసకోశ వ్యాధులు, అలాగే పొగాకు, మద్యం వాడకం వల్ల వచ్చే తీవ్ర అనారోగ్యాలు.మహిళలకు గర్భధారణ, ప్రసవానంతరం ఆరోగ్య పరీక్షలు క్రమంగా జరుగుతాయి. కానీ చాలామంది పురుషులు 40 ఏళ్లు వచ్చే వరకు ఎలాంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం లేదు. తమిళనాడులో నమోదైన మొత్తం 6,93,207 మరణాలలో కేవలం 2,80,856 మరణాలు (41%) మాత్రమే వైద్యపరంగా ధ్రువీకరించినవి. పురుషుల మరణాలలో 42%, మహిళల మరణాలలో 38% మాత్రమే మెడికల్ సర్టిఫికేషన్ పొందాయి.ఆ రాష్ట్రంలో ప్రతి 10 మరణాల్లో 6 ఆసుపత్రుల వెలుపలే జరుగుతున్నాయి. ఆసుపత్రుల బయట జరిగే మరణాలకు గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి ‘వెర్బల్ అటాప్సీ’ వంటి విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.స్వీడన్‌లో 2025లో 46,000 మంది పురుషులు, 46,200 మంది మహిళలు మరణించారు. అక్కడ మరణాల సంఖ్య ఇరు వర్గాల్లో దాదాపు సమానంగా ఉన్నప్పటికీ, స్వీడన్‌లో కేవలం 10% మరణాలు మాత్రమే 65 ఏళ్ల వయస్సు కంటే ముందు జరుగుతాయి. అదే మన దేశంలో అయితే 42% మరణాలు 65 ఏళ్ల కన్నా ముందే సంభవిస్తున్నాయి.దీర్ఘకాలిక వ్యాధులు, రోగాలను గుర్తించేందుకు ఇంటి వద్దకే వైద్య సేవలు, నిర్మాణ కార్మికులకు హెల్త్ చెకప్‌లు అందిస్తున్నారు. కూలీ కోల్పోతామనే భయంతో పగటిపూట ఆసుపత్రులకు రాని పురుషుల కోసం సాయంత్రం వేళల్లో క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. ఇక్కడ బీపీ, షుగర్ తనిఖీలు చేస్తున్నారు. ఉపాధి కోసం ద్విచక్రవాహనాలపై ప్రయాణించే పురుషుల భద్రత దృష్ట్యా రోడ్డు భద్రతా చర్యలను తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉంది. పురుషుల అకాల మరణాలను నివారించడం అనేది కేవలం వారి ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, అది కుటుంబ ఆర్థిక భద్రతకు. మహిళలు, పిల్లల భవిష్యత్తుకు రక్షణ అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఓటు హక్కు పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం

ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ - టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు



పెద్దపల్లి,అక్టోబర్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కైన ఓటు హక్కును కాలరాసేలా ఎన్నికల సంఘం వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని,అర్హులైన ప్రతి పౌరుడి ఓటును కాపాడేంత వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం సాగిస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్,టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు హెచ్చరించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో అర్హులైన వారి పేర్లను ఏకపక్షంగా తొలగించడాన్ని నిరసిస్తూ,ఏఐసీసీ,టీపీసీసీ పిలుపు మేరకు బుధవారం గోదావరిఖనిలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో సమరశంఖం పూరించారు.

రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు,54వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా సారథ్యంలో స్థానిక మెయిన్ చౌరస్తా నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు వేలాది మంది కార్యకర్తలతో కదం తొక్కుతూ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరికి వ్యతిరేకంగా మెయిన్ చౌరస్తాలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్,టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు మాట్లాడుతూ ఓట్ల సవరణ ముసుగులో అధికార పక్షానికి కొమ్ముకాస్తూ అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి గల్లంతు చేసే కుట్రలను తిప్పికొడతామని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత,జవాబుదారీతనం పాటించకపోతే ప్రజాక్షేత్రంలో ఎన్నికల సంఘం విశ్వసనీయత దెబ్బతింటుందని,ఓటర్ల తొలగింపులపై తక్షణమే ఉన్నతస్థాయి విచారణ చేపట్టడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వారు తేల్చిచెప్పారు.ఈ మహా ప్రదర్శనలో నగర మేయర్ మహంకాళి స్వామి,వివిధ డివిజన్ల కార్పొరేటర్లు,కాంగ్రెస్ శ్రేణులతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన సీపీఐ,సీపీఐ-ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు, గంగవ్రత్ర, ముదిరాజ్, యాదవ్, విశ్వబ్రాహ్మణ,నాయి బ్రాహ్మణ,మాల, మాదిగ, గౌడ,మైనారిటీ తదితర ప్రజా సంఘాల ప్రతినిధులు, యువజన,మహిళా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఆటపాటల గొంతుకలకు ఆకలి కేకలా

- నిరుద్యోగ కళాకారుల దీక్షకు బీఆర్ఎస్ ...సీపీఐ నేతల మద్దతు



పెద్దపల్లి,అక్టోబర్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ ఉద్యమంలో తమ ఆట,పాటలతో ప్రజలను చైతన్యపరిచి కీలక పాత్ర పోషించిన నిరుద్యోగ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు,మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి,సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద నిరుద్యోగ కళాకారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు వారు వేర్వేరుగా హాజరై పూర్తి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా తెలంగాణ సాంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టిన కళాకారులు నేడు తమ న్యాయమైన హక్కుల కోసం రోడ్డెక్కి నిరాహార దీక్షలు చేయాల్సి రావడం ఎంతో విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కళాకారుల సమస్యలను పరిష్కరించకపోతే,వారికి అండగా నిలిచి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్,కాశీపక వాసు,పల్లె మధు, జక్కుల శ్రీకాంత్,స్వామి వివేక్ పటేల్,సీపీఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్,జిల్లా అధ్యక్షుడు ఎండి రజాక్,రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ తుంగాని రాకేష్, కల్చరల్ ఇన్‌ఛార్జ్ దబ్బేట పుష్పలత, ఆర్గనైజర్ కలవేని రాణి,ఉద్యమ కళాకారులు కన్నూరి ఆంజనేయులు, గాజుల రమేష్,దుబాసి శ్రీనివాస్, పులిపాక బానిష్ నిట్టూరు సరూప,బట్టల గీత,పెండెం కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌తోనే సంపూర్ణ ప్రగతి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ

- ఘనంగా సేవా జ్యోతి యాత్ర ..హోరెత్తిన బీజేపీ భారీ బైక్ ర్యాలీ



పెద్దపల్లి,అక్టోబర్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారతదేశం ప్రపంచ యవనికపై అగ్రగామిగా ఎదుగుతోందని,2047 నాటికి దేశాన్ని సంపూర్ణ ప్రగతిపథంలో నిలబెట్టే వికసిత్ భారత్ మహా సంకల్పంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి పౌరుడూ స్వచ్ఛందంగా భాగస్వామి కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి పిలుపునిచ్చారు.ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం,ఆదర్శప్రాయమైన సుపరిపాలనను పురస్కరించుకుని బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా పెద్దపల్లి పట్టణంలో నిర్వహించిన సేవా జ్యోతి యాత్ర భారీ బైక్ ర్యాలీ విశేష ప్రజాదరణ మధ్య అట్టహాసంగా సాగింది.?ఈ సందర్భంగా స్థానిక సిరి ఫంక్షన్ హాల్‌లో నాయకులు,కార్యకర్తలతో కలిసి ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సందేశ ప్రసంగాన్ని వీక్షించారు.అనంతరం జరిగిన సభలో మూగ జయశ్రీ,కర్రె సంజీవరెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్ర అభివృద్ధి,బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి గడపకూ చేరవేయడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమన్నారు. సుపరిపాలన ఫలాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంతో పాటు సమాజంలో సేవాభావం,దేశభక్తిని పెంపొందించేందుకు పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల్లో ఉండాలని సూచించారు.ప్రధాని చూపిన ప్రజాసేవా బాటను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.అనంతరం సిరి ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమైన భారీ బైక్ ర్యాలీ పెద్దపల్లి పురవీధుల్లో హోరెత్తింది.పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యువకులు,పార్టీ కార్యకర్తలు చేత త్రివర్ణ పతాకాలు,పార్టీ జెండాలు ధరించి ఉత్సాహంగా బైక్‌లపై కదం తొక్కారు.సిరి ఫంక్షన్ హాల్ నుంచి పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా స్థానిక బస్టాండ్ వరకు క్రమశిక్షణతో సాగిన ఈ ప్రదర్శనకు స్థానిక ప్రజలు,వ్యాపారులు సాదర స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి నాగపూర్ రాజమౌళి గౌడ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుగ్యాల ప్రదీప్ కుమార్, గొట్టిముక్కల సురేష్ రెడ్డి,నల్ల మనోహర్ రెడ్డితో పాటు జిల్లా,మండల స్థాయి నాయకులు,వివిధ మోర్చాల బాధ్యులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మొహమ్మద్ మోసిన్



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 07 (ప్రజాకలం): జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా మెట్ పల్లి పట్టణానికి చెందిన మొహమ్మద్ మోసిన్ నియమితులయ్యారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం మోసిన్ అందించిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు నందయ్య తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించి, తనపై నమ్మకం ఉంచిన మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



మల్లాపూర్, అక్టోబర్ 7 (ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండలంలోని గిరిజన మినీ గురుకులం, టీజీ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, భోజనం, వసతి, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భోజనం నాణ్యతపై కూడా ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించాలని అధికారులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పల్లికొండ నరేష్, జిల్లా విద్యాధికారి కె. రాము,మండల విద్యాధికారి కేతిరి దామోదర్ రెడ్డి, తహసీల్దార్ రామ్ చందర్,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భూమేష్ ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తుకు భరోసా ఆధార్

- ఆధార్ ప్రత్యేక శిబిరం.. నేడు కూడా కొనసాగింపు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,అక్టోబర్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ ఆధార్ నమోదును తప్పనిసరిగా పూర్తి చేయించాలనే సంకల్పంతో రామగుండం ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మార్గదర్శకాల మేరకు రెండు రోజుల పాటు తలపెట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్ బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. మొదటి రోజు స్థానిక తల్లిదండ్రులు,సంరక్షకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధార్ నమోదు చేయించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అంగన్‌వాడీ పోషకాహార లబ్ధి,భవిష్యత్ పాఠశాల ప్రవేశాలకు ఆధార్ ఎంతో కీలకమని,ప్రతీ చిన్నారికి గుర్తింపు కార్డు అందాలన్నదే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని అధికారులు వివరించారు.ఈ ప్రత్యేక ఆధార్ నమోదు ప్రక్రియ గురువారం అక్టోబర్-08న కూడా నిరంతరాయంగా కొనసాగుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.రామగుండం పరిధిలోని తల్లిదండ్రులు ఇంకా ఎవరైనా ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డు తీసుకోకపోతే, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఎలాంటి రుసుములు, ప్రయాసలు లేకుండా స్థానిక ఐసీడీఎస్ కేంద్రంలోనే అందుబాటులో ఉన్న ఈ శిబిరానికి చిన్నారుల జనన ధ్రువీకరణ పత్రాలు,తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

విద్యాశాఖ పనుల్లో జాప్యం వద్దు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,అక్టోబర్ 07:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన విద్యాశాఖ పనితీరుపై మండల విద్యాధికారులు,ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి కనీస చదవడం,రాయడం,గణిత నైపుణ్యాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.ప్రతి కాంప్లెక్స్ పరిధిలో ఎఫ్ఎల్ఎన్ అమలుపై నిరంతరం సమీక్షలు జరపాలని,లోపాలను సరిదిద్దాలని సూచించారు.పదో తరగతిలో వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి,విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు.పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం,అల్పాహారం నాణ్యతపై రాజీ పడకుండా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతర తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా,మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



వికసిత్ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

సాయి గార్డెన్స్‌లో ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించిన బీజేపీ నాయకులు



నాగర్‌కర్నూల్ అక్టోబర్ 07 (ప్రజాకలం): వికసిత్ భారత్ సంకల్ప సభలో భాగంగా న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని నాగర్‌కర్నూల్‌లోని సాయి గార్డెన్స్‌లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుళ్ళ వీరేంద్ర గౌడ్‌తో కలిసి బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నాయకులు భరత్ ప్రసాద్ పోతుగంటి, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, పార్టీ పదాధికారులు, కార్యకర్తలు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 25 ఏళ్ల నిరంతర పాలనా ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ ప్రజాసేవ, ప్రజాస్వామ్య శక్తి, యువత మరియు మహిళల భాగస్వామ్యం, ఆత్మనిర్భర భారత్‌తో పాటు 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంపై సందేశాన్ని అందించారు. దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములై పనిచేయాలని ప్రధాని పిలుపు ఇచ్చారని నాయకులు తెలిపారు. మోదీ ప్రసంగం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని, మరింత సేవా సంకల్పాన్ని నింపిందన్నారు. “25 ఏళ్ల సేవ.. ఒకే సంకల్పం.. వికసిత్ భారత్” అనే లక్ష్యంతో దేశ ప్రగతికి కృషి చేయాలని వారు పేర్కొన్నారు.

దసరా వేడుకల ఏర్పాట్లకు మినీ ట్యాంక్‌బండ్ ముస్తాబు

పరిశుభ్రత, పారిశుద్ధ్య పనులు పరిశీలించిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 07 (ప్రజా కలం): దసరా పండుగను పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై చేపడుతున్న శుభ్రత, పారిశుద్ధ్య ఏర్పాట్లను ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సునెంద్ర, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ పడిగే శంకర్ బుధవారం పరిశీలించారు. దసరా పండుగ సందర్భంగా మినీ ట్యాంక్‌బండ్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని వారు అధికారులకు సూచించారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, పండుగ రోజుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య బృందాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రజలు, కుటుంబాలతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకునేలా మినీ ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, వెలుతురు తదితర ఏర్పాట్లను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పండుగ సందర్భంగా ప్రజల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని వారు తెలిపారు. దసరా పండుగను పురస్కరించుకుని మినీ ట్యాంక్‌బండ్‌ను సందర్శించే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని అధికారులు తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో చింతకుంట గ్రామంలో 20 సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎస్పీ డా. జి. జానకి షర్మిల

నిర్మల్ అక్టోబర్ 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

“గ్రామ భద్రత – మనందరి బాధ్యత” అనే నినాదంతో ముధోల్ మండలం చింతకుంట గ్రామంలో ప్రజల సౌజన్యంతో గ్రామ పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రారంభించారు. వీటి ద్వారా గ్రామంలోని ముఖ్య ప్రాంతాలు, ప్రధాన రహదారులు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలపై నిరంతర నిఘా కొనసాగుతుంది. “నేరాల రహిత గ్రామం – సీసీ కెమెరాల నిఘాలో మన చింతకుంట” అనే లక్ష్యంతో గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించడం అభినందనీయమని ఎస్పీ తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను గుర్తించడంతో పాటు, దొంగతనాలు, ప్రమాదాలు తదితర ఘటనల దర్యాప్తులో కీలక ఆధారాలు లభిస్తాయని పేర్కొన్నారు.

ప్రజల సహకారంతోనే సమగ్ర భద్రత

“ప్రజల సహకారం – పోలీసుల సమన్వయం– సురక్షిత గ్రామం” అనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. చింతకుంట గ్రామ ప్రజలు తమ గ్రామ భద్రత కోసం ముందుకు వచ్చి 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. గ్రామ భద్రత ప్రజలందరి సమిష్టి బాధ్యత అని పేర్కొంటూ, ఇతర గ్రామాల ప్రజలు కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చి నేరాల రహిత, సురక్షిత గ్రామాల నిర్మాణానికి సహకరించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భైంసా ఎ ఎస్పీ సాయి కిరణ్, సి ఐ దీపక్, ఎస్ ఐ ప్రదీప్, డబ్ల్యూ ఎస్ ఐ పెర్సిస్, గ్రామ పెద్దలు, వి డి సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నిరుపేద బాలలకు ఉచిత న్యాయ రక్షణ

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల - ఫీజుల భారం లేకుండా ఉచిత వాదనలు

- బాల నేరస్థుల కోసం పెద్దపల్లిలో ప్రత్యేక న్యాయ కేంద్రం

పెద్దపల్లి,అక్టోబర్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ న్యాయానికి దూరం కాకూడదన్నదే న్యాయసేవాధికార సంస్థ ప్రాథమిక లక్ష్యమని పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల స్పష్టం చేశారు.జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జేజేబీ కోర్టు ఆవరణలో బాల నేరస్థుల సహాయార్థం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉన్న నిరుపేదలు, మహిళలు,ఎస్సీ,ఎస్టీ వర్గాలు,దివ్యాంగులకు సంస్థ తరఫున ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామని తెలిపారు.అదే తరహాలో ఆర్థిక స్తోమత లేని బాల నేరస్థులకు కూడా న్యాయపరమైన రక్షణ కల్పించేందుకే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ కేంద్రం ద్వారా సేవలందించేందుకు బాలల న్యాయ మండలి కమిటీ అధికారిక న్యాయవాదిగా బర్ల రమేష్ బాబును,న్యాయ సహాయ స్వచ్ఛంద కార్యకర్తగా చిప్పకుర్తి సతీష్‌ను నియమించినట్లు ఆమె వెల్లడించారు.వీరు నిరంతరం అందుబాటులో ఉంటూ కోర్టులో ఉచితంగా వాదనలు వినిపిస్తారని,తల్లిదండ్రులు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.ప్రస్తుతం ఈ కోర్టుకు ఇన్‌ఛార్జ్ న్యాయమూర్తిగా దుర్గం గణేష్ వ్యవహరిస్తున్నారని,ప్రతి బుధవారం కేసుల విచారణ కొనసాగుతుందని తెలిపారు. ప్రైవేట్ న్యాయవాదులను నియమించుకోలేని నిరుపేద కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని



కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ కోయిర్కర్,బాలల న్యాయ మండలి ఇంచార్జ్ న్యాయమూరి దుర్గం గణేష్,బాలల పరిరక్షణ విభాగం జిల్లా చైర్ పర్సన్ బొబ్బిలి శ్రీధర్,పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల మల్లేశం,ప్రధాన కార్యదర్శి రాచూరి శ్రీకాంత్,జిల్లా బాలల పరిరక్షణ అధికారి జితేందర్,న్యాయవాది బర్ల రమేష్ బాబు, స్వచ్ఛంద కార్యకర్త చిప్పకుర్తి సతీష్,ఉచిత న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు నుచ్చు శ్రీనివాస్,భానుకృష్ణ,కుమారి సంకీర్తన, న్యాయ మరియు పరిశీలనాధికారి శ్రీమతి రజిత,బాలల రక్షణ హెల్ప్‌లైన్ సమన్వయకర్త శ్రీమతి ఉమాదేవి,శ్రీమతి ఝాన్సీ,శ్రీమతి శారద,మల్లేశం,ఇతర న్యాయవాదులు,భరోసా కేంద్ర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- మంథని అటవీశాఖ అధికారి ఎం.వినయ్ నాయక్



మంథని,అక్టోబర్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) వన్యప్రాణుల పరిరక్షణ ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని మంథని అటవీ శ్రేణి అధికారి ఎం.వినయ్ నాయక్ స్పష్టం చేశారు.జిల్లా అటవీ శాఖాధికారి ఆదేశాల మేరకు, బుధవారం ముత్తారం మండలం ఆడవిశ్రీరాంపూర్ గ్రామంలో మంథని, పెద్దపల్లి అటవీ సిబ్బంది స్థానిక రక్షకభట సిబ్బందితో కలిసి సంయుక్తంగా నిర్బంధ తనిఖీలు చేపట్టారు.ఈ ఆకస్మిక తనిఖీల్లో వేటగాళ్లకు చెందిన రెండు వేట వలలు,20 ఉచ్చులు,ఒక ఇనుప బోను,రెండు కిలోల తీగను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా గ్రామస్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అటవీ శ్రేణి అధికారి ఎం.వినయ్ నాయక్ మాట్లాడుతూ వృక్షాలను అక్రమంగా నరకడం, మూగజీవాలను వేటాడటం చట్టరీత్యా తీవ్రమైన నేరాలని హెచ్చరించారు. అడవులు,అటవీ జంతువుల రక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అక్రమ వేటకు పాల్పడితే ఉపేక్షించేది లేదని,కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.పాఠశాలలు,కళాశాలల్లో అవగాహన సదస్సులు అనంతరం దర్యాపూర్ ఆదర్శ పాఠశాల,జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో వన్యప్రాణుల పరిరక్షణపై చర్చించారు.ఆ తర్వాత ఆదివిశ్రాంపూర్ రక్షిత అటవీ ప్రాంతంలోని 444వ విభాగంలో క్షేత్రస్థాయి పాదయాత్ర చేపట్టారు.మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు,వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మంథని అటవీ శ్రేణి అధికారి ఎం.వినయ్ నాయక్, పెద్దపల్లి అటవీ శ్రేణి అధికారి టి.సతీష్ కుమార్,ఉప శ్రేణి అధికారులు పి.దేవదాస్, ఎన్.రమేష్,అటవీ విభాగ అధికారులు ఎం.నరసయ్య,హెచ్.మంగీలాల్,ఎస్.డి. రహిమతుల్లా,ఎం.డి.అమీర్‌ఉద్దీన్,ముదస్సర్ షా ఖాన్,నహీదా పర్వీన్,ఎం.రవి,అటవీ బీట్ అధికారులు కె.పవన్ కుమార్,ఎం.శ్రీకాంత్,ఎన్.మేఘ రాజు,కె.తిరుపతి, పి.రంజిత,ఎస్.శ్రావంతి,ఎ.మాధురి,ఎస్.ప్రదీప్,క్షేత్రస్థాయి జీవశాస్త్రవేత్త ఎం.చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వార్థం లేకుండా దేశ హితం కోసం ఆలోచించే వ్యక్తి ప్రధాని

సేవా జ్యోతి కలశ యాత్ర”లో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి రామారావు పటేల్

సమావేశానికి జిల్లా నుండి భారీ సంఖ్యలో కార్యకర్తల హాజరు

నిర్మల్ అక్టోబర్ 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఇలాంటి స్వార్థం దేశహితం కోసం ఆలోచించే వ్యక్తి భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ అని దేశ ప్రజలు కుటుంబ సభ్యులుగా భావించి ఎలాంటి స్వార్థం లేకుండా జయశంకర్ కోసం ఆలోచించే అందరి శ్రేయస్సు కోసం సమాజంలో పేరు మీరు ప్రఖ్యాతి గాంచిన వ్యక్తి ప్రధాని అని సీఎల్పీ నేత నిర్మల్ ముధోల్ నియోజకవర్గం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 13 సంవత్సరాల గుజరాత్ ముఖ్యమంత్రి దేశ ప్రధానిగా ఆయన చేస్తూ సేవలు శాశ్వతంగా ప్రజల గుండెల్లో ఉండిపోతున్నాయని దేశ ఆర్థిక వ్యవస్థ మూడవ స్థానానికి ఎగబాకి నేడు ప్రపంచానికి శాసించే సాయికి విశ్వ గురువుగా ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నారంటే ఈరోజు 18 గంటలు పాటు ఆయన ప్రజల కోసం పనిచేస్తున్నారన్నారు 370 ఆర్టికల్ రద్దుతో ఎన్నో విజయాలు సాధించిన ఘనత ఆయన ఆశయాలకు అనుకూలం నడుచుకోవాలని కార్యకర్తలు నాయకులకు హితువు పలికారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల అంకితభావంతో కూడిన ప్రజాసేవకు కృతజ్ఞతలు తెలియజేస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలోని బుధవారం ఆర్.కె. కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ప్రధాని గారి 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని స్మరించుకుంటూ, ఆయన సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహించిన “సేవా జ్యోతి కలశ యాత్ర” ర్యాలీలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, తో పాటు ముధోల్



నియోజకవర్గం ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రితిక్ రాథోడ్, గారు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి సేవా, సంకల్పం, దేశాభివృద్ధి పట్ల ఆయన చూపుతున్న అంకితభావాన్ని ప్రజలకు తెలియజేయడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఈసారి నిర్మల్ పట్టణం లో గణేష్ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించినందుకు విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ హిందూ వాహిని కార్యకర్తలు కాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, జిల్లా ఇన్‌చార్జ్ శ్రీమతి గోపిడి శ్రావణి రెడ్డి, సీనియర్ నాయకులు, జిల్లాలోని ఖానాపూర్ నిర్మల్ నియోజకవర్గం భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయగా అనంతరం ప్రత్యేక సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.లి

వేరువేరు ఘటనల్లో పలువురికి గాయాలు

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 7 (ప్రజాకలం) మండల పరిధిలోని మేడిపల్లి గ్రామానికి చెందిన కట్ట సుదర్శన్ బుధవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని మెట్ పల్లి పోలీసులు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో పండ్లు కొనుగోలు చేసేందుకు బైక్‌పై మేడిపల్లి నుంచి మెట్ పల్లికి వస్తుండగా ఎదురుగా వచ్చిన పల్సర్ బైక్‌ను నడుపుతున్న వ్యక్తి అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి సుదర్శన్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుదర్శన్ కుడికాలు, కుడిచేయి, నుదుటిపై గాయాలయ్యాయని వెల్లడించారు. బాధితుడి సోదరుడు కట్ట కోటేశ్వర్ ఫిర్యాదు మేరకు మెట్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్ పల్లి బస్టాండ్ వద్ద బస్సు ఢీ.. వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రికి వచ్చిన 75 ఏళ్ల వృద్ధురాలిని ఎలక్ట్రిక్ బస్సు ఢీకొట్టిన ఘటన మెట్ పల్లి బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. నాగాపూర్‌కు చెందిన కోరం హనుమక్క ను ఆమె కుమార్తె బాసకొండ రాజమణి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా నిజామాబాద్ నుంచి మెట్ పల్లి వస్తున్న ఎలక్ట్రిక్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హనుమక్క రెండు కాళ్లు విరిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి కుమార్తె రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మెట్ పల్లి ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. పలువురికి గాయాలు

లారీ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలైన ఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్లకు చెందిన మహమ్మద్ నజీర్ తన ఆటోలో నలుగురు ప్రయాణికులతో మొగిలిపేట నుంచి మెట్ పల్లికి వస్తుండగా, ఉదయం 6.30 గంటల సమయంలో వేంపేట రోడ్డు మూల మలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నజీర్‌తో పాటు ఆటోలో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. నజీర్ ఫిర్యాదు మేరకు మెట్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలేయ వ్యాధిగ్రస్తులకు ఉచిత ఫైబ్రో స్కాన్

రూ.5 వేల విలువైన పరీక్ష ఉచితం.. అక్టోబర్ 8న ప్రత్యేక వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్ అక్టోబర్ 07 (ప్రజా కలం): జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఉన్న శ్రీ మణికంఠ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో కాలేయ వ్యాధిగ్రస్తులు, లివర్ సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ నెల 8వ తేదీన ఉచితంగా ఫైబ్రో స్కాన్ నిర్వహించనున్నట్లు గ్యాస్ట్రాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ మణికంఠ జగదీష్ తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుల్లారెడ్డి హాస్పిటల్ రోడ్డులోని శ్రీ మణికంఠ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈ ఉచిత పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సాధారణంగా సుమారు రూ. 5 వేల వరకు ఖర్చయ్యే ఫైబ్రో స్కాన్‌ను ఉచితంగా చేయించుకునే అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా లివర్ సమస్యలు ఉన్నవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, మద్యపానం అలవాటు ఉన్నవారు, ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నవారు, ధూమపానం చేసే వారు ఈ శిబిరంలో పాల్గొని తమ కాలేయ పనితీరును పరీక్షించుకోవాలని సూచించారు. కాలేయ వ్యాధి అనుమానం ఉన్నవారు కూడా పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885880155, 9885880166 నంబర్లలో సంప్రదించాలని ఆసుపత్రి నిర్వాహకులు సూచించారు.

తాండాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

– ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

– 1.06 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 07:

గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తాండాల సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఎల్లంబాయి తాండా నుంచి కొత్త తాండా వరకు ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులతో రూ. 1.06 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తాండాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వర్షాకాలంలో ప్రజలు, రైతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.గ్రామాలు, తాండాల మధ్య మెరుగైన రహదారి సౌకర్యం ఉంటేనే అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్.పి. వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, కార్యనిర్వాహక అధ్యక్షులు చెన్నయ్య, స్థానిక సర్పంచులు సతీష్, బొట్టు శ్రీను, లింగం నాయక్, ఉప సర్పంచ్ నీలిబాయి రాజు, నాయకులు టంకర కృష్ణయ్య యాదవ్, వాల్దాస్ ప్రతాప్ గౌడ్, జె వెంకటయ్య, యాదిరెడ్డి, చందర్ నాయక్, ఖలీం, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో 49 పోస్టులు

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 7 (ప్రజా కలం):జోగులాంబ గద్వాల జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో 49 పోస్టులను కాంట్రాక్ట్/అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మొత్తం పోస్టుల్లో ఎన్‌హెచ్‌ఎం కింద 36, ఆయుష్ కింద 8, ఎన్‌టీఈపీ కింద 5 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 8 నుంచి 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను సమర్పించాలి. పోస్టుల వారీగా ఖాళీలు, విద్యార్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాలను gadwal.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు.



రైతులు అధిక ఆదాయం వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ ,సహకార శాఖల కార్యదర్శి కే. సురేంద్ర మోహన్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 07:

వ్యవసాయ,ఉద్యాన సాగు ఉత్పత్తి ద్వారా రైతులు అధిక ఆదాయం వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలనిరాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్ ,సహకార శాఖల కార్యదర్శి కే. సురేంద్ర మోహన్ అన్నారు.బుధవారం ఆయన మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో వి.సి.కాన్ఫరెన్స్ హాల్ లో వ్యవసాయ,ఉద్యాన,పట్టు పరిశ్రమ,మార్కెటింగ్,సహకార శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ఎల్ నినో పంటల ఉత్పత్తి పై ప్రభావం,ఖరీఫ్ లో వరి ధాన్యం కొనుగోళ్లు,రాబోయే రబీ ప్రణాళిక,పత్తి, జొన్న ఇతర పంటల సాగు , ఎం.ఎస్.పి ,ఫార్మర్ ఐ.డి.,ఆయిల్ ఫాం,మల్బరీ సాగు తదితర విషయాలపై సమీక్షించారు.జిల్లాలో 31 శాతం వర్షపాతం లోటు ఉందని, జిల్లాలో 11 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు.ఖరీఫ్ లో ఒక లక్షా 45 వేల ఎకరాల వరకు వరి సాగు జరిగిందని,గత ఖరీఫ్ లో 2 లక్షల 32 వేల ఎకరాల్లో వరి సాగు తగ్గిందని వివారించారు.ఎల్ నినో వర్షపాతం లోటు కారణంగా ఆరు తడి పంటలు,ఉద్యాన పంటలు సాగు కు రైతులను ప్రోత్సహించినట్లు వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ వివరించారు.సన్న రకం లో 7 రకాలకు బోనస్ ప్రకటించినందున వాటిని గుర్తించేందుకు వ్యవసాయ డిప్లొమా,బి.ఎస్.సి.అగ్రికల్చర్ వారిని నియమించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున అవసరమైన చోట నియామకం చేసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి సూచించారు.జిల్లాలో పత్తి తేలిక నేల స్వభావం కారణంగా కొంత పత్తి పంట దెబ్బతిందని అన్నారు జిల్లాలో వరి సాగు ఆలస్యంగా నాట్లు వేశారని ఆగస్టు వరకు కూడా వేశారని,అక్టోబర్ చివరి నుండి ధాన్యం వస్తుందని వ్యవసాయ అధికారి వివరించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సవ్యంగా నిర్వహించాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద బ్యానర్ తో పాటు, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహించిన 7 ధాన్యం వెరైటీలకు సంబంధించిన వివరాలను అందులో పేర్కొనాలని తెలిపారు.పత్తి,జొన్నలు మార్కెట్ లో ఎం ఎస్.పి కంటే ఎక్కువ రేటు లభిస్తుందని అధికారులు వివరించారు రబీ సాగు ప్రణాళిక పై సమీక్షించి రైతులకు అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉంచాలని అన్నారు.జిల్లాలో ఉద్యాన పంటల సాగు 656 ఎకరాల నుండి 3160 ఎకరాల వరకు పెరిగిందని,రైతులు వరి, పత్తి సాగు నుండి ఉద్యాన పంటలు చేపట్టి అధిక ఆదాయం పొందుతున్నట్లు ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్ వివరించారుఅందువల్ల రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర, బోనస్ లకు మించి బయట ఎక్కువ ధర వచ్చేలా ఉంటే ప్రత్యేకించి రైతు ఉత్పాదక సంస్థల ద్వారా వారికి మరింత ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. .హైదరాబాద్ కు జిల్లా దగ్గర గా ఉన్నందున జిల్లాలో వ్యవసాయ,సహకార శాఖ ద్వారా ఉన్న 17 రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులమార్కెటింగ్,ఎగుమతి ద్వారా రైతులు అధిక ఆదాయం లభించేలా తగు ప్రణాళిక తో చర్యలు తీసుకోవాలని అన్నారు మహిళా సంఘాలు బెనీషా బ్రాండ్ తో చురుగ్గా వ్యాపార కార్యక్రమాలునిర్వహిస్తున్నారని,అదే విధంగా రైతు ఉత్పత్తి సంఘాలను ఒక తాటి పైకి తెచ్చి పాలమూరు బ్రాండ్ తో వారిని వ్యాపార వేత్తలుగా తీర్చి దిద్దాలని అన్నారు.,ఇందుకు వ్యవసాయం పంట ఉత్పత్తులపై బయ్యర్స్,సెల్లెర్స్ సమావేశాలు ఏర్పాటు చేయాలని,హైదరాబాద్ లో ప్రైవేట్ కంపెనీలతో అనుసంధానం చేయాలని,వారు సంఘాలకుశిక్షణా నిస్తారని అన్నారు. రైతు ఉత్పత్తి సంఘాల కొనుగోలు ప్లాన్ డి.పి.ఆర్.తయారు చేస్తే చీజనజ నుండి 2 కోట్ల వరకు రుణం అందిస్తుందని అన్నారు. రైతులు సబ్సిడీ పథకాలు పొందేందుకు,ఎరువులకు, కేంద్ర ప్రభుత్వం ఫార్మర్స్ ఐడి కచ్చితం చేసినందున త్వరగా ఫార్మర్స్ ఐడిని పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించాలని, అలాగే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, భవిష్యత్తులో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్తున్నారని, అలాగే వినియోగదారులు కూడా ఎంత దరైన వెచ్చించి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. బయో రీసోర్స్ సెంటర్లను చురుకుగా పనిచేసేలా చూడాలని, ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి ఆరోగ్యం, సాంద్రత పెరుగుతుందని అన్నారు. వ్యవసాయాన్ని శాస్త్రబద్ధంగా, బాధ్యతాయుతంగా నిర్వహించేలా రైతులను చైతన్యం చేయాలన్నారు. పంట మార్పిడి, సెరికల్చర్ ,హర్టికల్చర్ ను ప్రోత్సహించాలని, సెరికల్చర్ పెంచాలని,చిన్న,సన్నకారు,పేద రైతులకు అవగాహన కలిగించాలని అన్నారు అలాగే కూరగాయల సాగును ప్రోత్సహించాలని చెప్పారు.వివిధ మార్గాల ద్వారా రైతుకు ఎక్కువ ఆదాయం వచ్చేలా అన్ని శాఖల అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, భవిష్యత్తులో రైతును కాపాడుకుంటేనే అందరికీ మేలు జరుగుతుందని ఆయన తెలిపారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వ్యవసాయ, ఉద్యాన, సహకార, తదితర శాఖల సమీక్ష సందర్భంగా వివరాలను తెలియజేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ,డి ఆర్.ఓ ఏ .నిర్మల,జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్,జిల్లా సహకార అధికారి కృష్ణ,జిల్లా ఉద్యాన అధికారి వేణుగోపాల్,జిల్లా మార్కెటింగ్ అధికారిని బాల మణి ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

అమ్మపల్లిలో భూముల రీసర్వేపై అవగాహన సదస్సు

- మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 07:

జడ్చర్ల మండలం అమ్మవల్లి గ్రామంలో చేపట్టనున్న భూముల రీసర్వేపై నిర్వహించిన గ్రామసభ/అవగాహన సదస్సులో మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ ఎస్ఎల్ఆర్, జడ్చర్ల తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూముల రీసర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రీసర్వేలో ఆధునిక రోవర్ సర్వే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూములను ఖచ్చితంగా కొలవడంతో పాటు, భూముల హద్దులను నిర్ధారించడం జరుగుతుందనివివరించారు.రీసర్వే పూర్తయిన అనంతరం భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి, సంబంధిత భూయజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ (స్కావీ) అందజేయడం జరుగుతుందని తెలిపారు. భూముల హద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించి భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, సమగ్రంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.రీసర్వే కార్యక్రమం సజావుగా, సమర్థవంతంగా పూర్తయ్యేందుకు గ్రామస్థులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

గొర్రెల పెంపకం నుంచి గానుగ నూనె మార్కెటింగ్ వరకు..

- పిఎసిఎస్ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



నాగర్‌కర్నూల్ అక్టోబర్ 07 (ప్రజా కలం): జిల్లాలో సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి గొర్రెల పెంపకం యూనిట్, పెట్రోల్ బంక్ నిర్మాణం, గానుగ నూనె ఉత్పత్తి--విక్రయ కేంద్రాలను పరిశీలించారు.

గొర్రెల పెంపకం యూనిట్ పరిశీలన

నాగర్‌కర్నూల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గొర్రెల పెంపకం యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. యూనిట్‌లోని గొర్రెల ఆరోగ్య పరిస్థితి, వయస్సు, బరువు, దాణా, సంరక్షణ చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం యూనిట్‌లో 5 నుంచి 6 నెలల వయస్సు గల గొర్రె పిల్లలు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గొర్రె పిల్లల బరువు పెరుగుదల, వ్యాధుల నివారణ, పశువైద్య సేవలు, భవిష్యత్ మార్కెట్ అవకాశాలపై కలెక్టర్ ఆరా తీశారు. మరో ఒకటి, రెండు నెలల్లో గొర్రెలు సుమారు 28 నుంచి 30 కిలోల బరువుకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గొర్రెలకు అందించే దాణా నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. పశువైద్య అధికారులతో సమన్వయం చేసుకుని నిర్ణీత సమయంలో టీకాలు, అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో గొర్రెల పెంపకానికి మంచి అవకాశాలు ఉన్నందున సహకార సంఘాలను బలోపేతం చేసి, రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు సమగ్ర విధానం అమలు చేయాలని సూచించారు.

పెట్రోల్ బంక్ పనుల పరిశీలన

వనపట్ల శివారులోఫూజూ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్‌ను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ బంక్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న ఇటువంటి వాణిజ్య కార్యకలాపాలు రైతులు, సంఘ సభ్యులకు ఆదాయ వనరులుగా మారేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ పేర్కొన్నారు.

గానుగ నూనెకు మార్కెటింగ్ విస్తరణ

తెలకపల్లి మండలం చిన్నముద్దునూరు గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గానుగ నూనె ఉత్పత్తి, విక్రయ కేంద్రాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. నూనె తయారీ ప్రక్రియ, ఉత్పత్తి సామర్థ్యం, ముడి సరుకు, నాణ్యత, ప్యాకేజింగ్, మార్కెటింగ్, విక్రయాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గానుగ నూనె ఉత్పత్తి, మార్కెటింగ్ ద్వారా సహకార సంఘానికి, స్థానిక రైతులకు కలుగుతున్న ప్రయోజనాలపై, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ఉత్పత్తిని కొనసాగించాలని, వినియోగదారుల్లో నమ్మకం పెంచే విధంగా ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. స్థానికంగా లభించే వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించి మార్కెట్‌లో మంచి ధర లభించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గానుగ నూనెకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మార్కెటింగ్ పరిధిని మరింత విస్తరించి, రైతులు మరియు సహకార సంఘాలకు అదనపు ఆదాయం వచ్చేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్. ఐ. ఆర్ ను పారదర్శకంగా పకడ్బందీగా

నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- మహబూబ్ నగర్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 07:

పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం ముఖ్య ఉద్దేశమని ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్.ఐ.ఆర్) మహబూబ్ నగర్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ అన్నారు.బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియ పై రాజకీయ పార్టీల ప్రతినిధుల లు, ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు.ముందుగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల ఈఆర్ఓలు ఆయా నియోజకవర్గాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై అబ్జర్వర్‌కు వివరించారు. ఇప్పటివరకు జారీ చేసిన నోటీసులు, పెండింగ్‌లో ఉన్న నోటీసులు, నిర్వహించిన హియరింగ్‌లు, మృతులు, వలస వెళ్లిన ఓటర్లు, 2002 నాటి ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని కేసులు, ఇతర అనామలీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలెక్టోరల్ రోల్ పరిశీలకులు, సురేంద్ర మోహన్‌మాట్లాడుతూ, ఆయా పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్ల (బి. ఎల్. ఎ) వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతోంది అనే అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు, బి.ఎల్.ఎ లు అధికారులకు సహకరించాలని కోరారు. దీనిపై స్పందిస్తూ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలో జిల్లా యంత్రాంగం, సర్ ప్రక్రియను సవ్యంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నారని , ఎలాంటి ఇబ్బంది లేదని, సర్ లో భాగస్వాములైన జిల్లా కలెక్టర్, ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లు,మొదలుకొని కిందిస్థాయి బూత్ లెవెల్ అధికారుల (బి.ఎల్.ఓ) వరకు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. అయితే పట్టణ ప్రాంతాల్లో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మున్సిపల్ సిబ్బందిని కూడా ప్రక్రియలో భాగస్వాములను చేయాలని అన్నారు.ముఖ్యంగా ఉద్యోగస్తులకు కూడా నోటీసులకు స్పందించేలా ఆయా శాఖల అధికారులకు తెలుపాలని కోరారు.బి.ఎల్.ఓ లు , మున్సిపల్ సిబ్బంది ఓటర్లను చైతన్యం చేయాలని అన్నారు.అనంతరం ఓటరు జాబితా పరిశీలకులు సురేంద్ర మోహన్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాను పూర్తి పారదర్శకంగా తయారు చేయాలన్నదే ఎన్నికల సంఘం ఉద్దేశమని, ఇందులో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో ఉండాలని, అలాగే అర్హత లేని వారు జాబితాలో ఉండకూడదని, ఈ విషయంలో అధికారులతో పాటు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కలిసి పని చేస్తే సాధ్యమవుతుందని అన్నారు. పెండింగ్ నోటీసులు జారీ పూర్తి చేయాలని , నిర్దేశిత గడువు లోగా సర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన సూచించారుఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ప్రతి బి.ఎల్. ఓ తో వారి పరిధిలో జారీ చేసిన నోటీసులు , అందుకున్న వారి వివరాలు, అలాగే నోటీసులకు సమాధానం ఇస్తూ ధ్రువ పత్రాలు సమర్పించిన వారు, నోటీసులకు సమాధానం లేని రాని వారి విషయంలో తీసుకుంటున్న చర్యలు, నోటీస్ అందుకున్న ఓటర్లు ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పిస్తున్నారు అన్న విషయాలపై క్షుణ్ణంగా సమీక్షించాలన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు డాక్యుమెంట్స్ సమర్పణ విషయంలో అవగాహన కలిగించాలని అన్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ వారీగా బూత్ లెవెల్ ఏజెంట్ ల నియామకం చేయాలని అన్నారు.ఒక ఓటర్ కు రెండు చోట్ల ఓటు హక్కు లేకుండా నోటీసు జారీ చేసి ఒక చోటే ఓటు హక్కు ఉండేలా చూడాలని, సర్ ప్రక్రియలు ఎక్కడైనా సమస్యలు ఉంటే అలాంటి వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి కూడా తీసుకువెళ్లి పరిష్కరించాలని చెప్పారు. ఎన్నికల జాబితా తయారీ అనుమానాస్పద కార్యక్రమం కాదని, పూర్తి పారదర్శకంగా, అందరికీ తెలియజేసి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని, సర్ ప్రక్రియ పూర్తి ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతుందన్నారు . జాబితా తయారీలో ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ లు పూర్తి జాగ్రత్తగా ఉండాలని, అలాగే పార్టీల ప్రతినిధులకలిసి పని చేస్తే తప్పులు లేని జాబితా తయారవుతుందని చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ నోటీసులు, హియరింగ్ ప్రక్రియ నిర్దేశిత గడువు కు ముందుగానే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియలో జిల్లా స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, సమావేశంలో వారు దృష్టికి తెచ్చిన సమస్యలు పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు

సర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, నియోజకవర్గాలు, ఈ. అర్. ఓ లు , ఎ .ఈ.ఆర్. ఓ లు, బి.ఎల్.ఓ, బి ఎల్ ఏ నియామకం, సర్ లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని వివరాలన్నింటినీ వివరించారు. జిల్లాలో రేషనలైజేషన్ తర్వాత 862 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రానికి బిఎల్ఓ ను నియమించడం జరిగిందని, అలాగే 2316 మంది బి.ఎల్.ఎ లు ఉన్నారని , 732488 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 103086 మంది చనిపోయిన, గుర్తించలేని, డబుల్ ఓటర్లు పోగాఆగస్టు 17 న ముసాయిదా జాబితా ప్రకారం 629402 మంది నమోదయ్యారని అన్నారు. ఓటరు జాబితాలో పేర్లలో అక్షర దోషాలు, చిరునామా, వయసు తదితర విషయాలలో తేడాలున్న 236590 మంది ఓటర్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేశామని, విచారణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జడ్చర్ల నియోజకవర్గం ఈ.ఆర్. ఓ, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, డి . ఆర్.ఓ ఎ.నిర్మల, ఆర్ . డి.ఓ నవీన్, మున్సివల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఎ.ఈ. ఆర్. ఓ లు, ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

ధ్రువీకరణ పత్రాల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లాలో 89 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు, అర్హతల పరిశీలన, ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియలో అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుదారులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను పకడ్బందీగా పరిశీలించాలని, ఎలాంటి సందేహాలకు అవకాశం లేకుండా అవసరమైన స్థాయిల్లో పత్రాలను మరోసారి ధ్రువీకరించుకోవాలని ఆదేశించారు. భర్తీ ప్రక్రియకు సంబంధించిన సమాచారం, తదుపరి దశల వివరాలను దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిల్లో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హత పత్రాల పరిశీలనను పూర్తి చేయాలని తెలిపారు. అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే, పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, భర్తీ చేయిస్తామని చెప్పే వ్యక్తులకు ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని ఆయన సూచించారు. భర్తీ ప్రక్రియకు సంబంధించి అధికారిక సమాచారం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, సీడీపీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండు విద్యుత్ సబ్ స్టేషన్లకు ఐదు కోట్ల 90 లక్షల రూపాయల నిధులు

- ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



నిర్మల్ అక్టోబర్ 07(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ముధోల్ నియోజకవర్గంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్ లకు ఐదు కోట్ల 90 లక్షల 18 వేల రూపాయల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తెలియజేశారు. లోవోల్టేజీ సమస్య వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో సమస్యను పరిష్కరించేందుకు ఈ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. తానూరు మండలంలోని భామ్ని గ్రామంలో 33/ 11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి లిరెండు కోట్ల 87 లక్షల 98 వేలు నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. కుబీర్ మండలంలోని వాయి లింగి గ్రామంలో 33/ 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మూడు కోట్ల రెండు లక్షల 20వేల రూపాయలు నిధులు వెచ్చించడం జరిగిందన్నారు. సమస్యను గత నెల11 న సంబంధిత శాఖ మంత్రి కి విన్నవించడంతో వెంటనే నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల కు కృతజ్ఞతలు చెప్పారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు శిక్ష

- రూ.2,000 జరిమానా విధించిన కోర్టు

నాగర్‌కర్నూల్ అక్టోబర్ 07 (ప్రజా కలం): మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో బిజినపల్లి మండలం నంది వడ్డెమాన్ గ్రామానికి చెందిన చెన్నయ్యకు కోర్టు రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో చెన్నయ్యను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామ్ గోపాల్ నిందితుడు చెన్నయ్యకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ, రూ.2,000 జరిమానా చెల్లించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ వివరాలను నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు.



ఆర్టీసీలో హోరాహోరీ పోరు!

ఐక్య కూటమి గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం




గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 7 (ప్రజా కలం): గద్వాల ఆర్టీసీ డిపోలో ఈ నెల 9న జరగనున్న యూనియన్ ఎన్నికల నేపథ్యంలో ఎంప్లాయీస్ యూనియన్–తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఐక్య కూటమి ఆధ్వర్యంలో ఎన్నికల సభ నిర్వహించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్య కూటమికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చాలా సంవత్సరాల తర్వాత ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు జరుగుతుండటం, కార్మికులు చైతన్యంతో ఎన్నికల్లో పాల్గొనడం శుభపరిణామమన్నారు. యూనియన్లు రద్దైన సమయంలోనూ ఎంప్లాయీస్ యూనియన్ కార్మికుల సమస్యలపై పోరాటాలు కొనసాగించిందని తెలిపారు. ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమంలో భాగంగా సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెను విజయవంతం చేయడంతో పాటు 32 డిమాండ్ల సాధన కోసం పోరాటం చేసినట్లు పేర్కొన్నారు. అందులో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ ప్రధానమైనదన్నారు. యూనియన్ ఎన్నికలు కార్మికుల హక్కులు, ఆత్మగౌరవానికి సంబంధించినవని నాయకులు పేర్కొన్నారు. గతంలో యూనియన్లు లేకపోవడంతో కార్మికులు పలు సమస్యలు, పని ఒత్తిడి, అధికారుల వేధింపులను ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో కార్మికులు తమ సమస్యల కోసం నిరంతరం పోరాడిన యూనియన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంప్లాయీస్ యూనియన్–ఐక్య కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించి కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రంగన్న, ఆటో యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్, ట్రెజరర్ ఆశన్న, ఎస్సీ–ఎస్టీ రీజినల్ కార్యదర్శి సురేష్, డిపో ఎస్సీ–ఎస్టీ అధ్యక్షుడు సురేష్‌వీర, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పరమేశ్వరయ్య, గద్వాల డిపో అధ్యక్షుడు గాలి రెడ్డి, కార్యదర్శి గిరిరాజు, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి బసన్న, మహబూబ్‌నగర్ రీజియన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంనాథ్, సహాయ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు. మహిళా కార్మికులు,యూనియన్ నాయకులు, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పొలాలకు ఊతం.. పనులకు పర్యవేక్షణ!

ఫార్మ్ పాండ్ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ బి. నర్సింగరావు

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 7 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండలంలోని వెంటపురం, పాతపాలెం గ్రామాల్లో VB-G RAM G పథకం కింద చేపట్టిన ఫార్మ్ పాండ్ పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. నర్సింగరావు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఫార్మ్ పాండ్ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన.. పనుల నాణ్యత, అమలు తీరు, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అనే అంశాలను తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి, గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, వ్యవసాయానికి ఉపయోగపడేలా పనులు చేపట్టాలని సూచించారు. పనులకు సంబంధించిన రికార్డులు, కొలతలు, ఇతర వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ పారదర్శకంగా, నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



పాఠశాల విద్యార్థి భద్రతలో నిర్లక్ష్యం.. కలెక్టర్ తీవ్ర ఆగ్రహం

ప్రధానోపాధ్యాయురాలిపై సస్పెన్షన్.. స్కావెంజర్‌ను విధుల నుంచి తొలగింపు

తానూర్,అక్టోబర్ 07(ప్రజా కలం): మండలం బెంబర్ ప్రాథమికోన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల సమయం ముగిసిన అనంతరం తరగతి గదిలోనే ఉండిపోగా, గది తాళం వేసిన ఘటనపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు, విద్యార్థుల భద్రత విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. స్వప్నను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు, అదేవిధంగా విధి నిర్వహణలో అలసత్వం వహించిన పాఠశాల స్కావెంజర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ బుధవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు,పాఠశాల ముగింపు సమయంలో ప్రతి విద్యార్థి సురక్షితంగా పాఠశాల నుంచి బయటకు వెళ్లాడా లేదా అనే విషయాన్ని ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యానికి తావు లేకుండా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల భద్రతా చర్యలను ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల ప్రారంభం నుంచి ముగింపు వరకు విద్యార్థుల భద్రతకు సంబంధించి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల రక్షణ, భద్రత విషయంలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, భవిష్యత్తులో జిల్లాలోని ఏ పాఠశాలలోనూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



మేజర్ కాలువలో ధోబీ ఘాట్ నిర్మాణం నిరుపేదలకు శాపం

- చిన్నారుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందంటున్న గ్రామస్థులు



తల్లాడ ఆగస్టు 7 ప్రజా కలం న్యూస్

తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో మేజర్ కాలువ ఆధునికీకరణ పనులు స్థానిక నిరుపేదలకు ఇబ్బందిగా మారాయి. పంట పొలాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో ఎన్ఎస్పీ కాలువను సీతారామ ప్రాజెక్ట్‌తో అనుసంధానం చేస్తున్న నేపథ్యంలో గ్రామ పరిధిలోని మేజర్ కాలువను వెడల్పు చేసి, ఇరువైపులా రక్షణ గోడలను నిర్మించారు. అయితే రక్షణ గోడల నిర్మాణంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక స్వల్ప వర్షానికే కాలువ పరిసరాల్లోని ఇళ్ల వద్ద నీరు నిలిచిపోతోందని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.కాగా,నివాస గృహాలకు అత్యంత సమీపంలో ధోబీ ఘాట్ల నిర్మాణం చేపట్టడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జనావాసాల మధ్య ధోబీ ఘాట్లు నిర్మించడం వల్ల చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నామని పేర్కొన్నారు.ధోబీ ఘాట్లను నివాస ప్రాంతాలకు దూరంగా నిర్మించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వర్షపు నీరు ఇళ్ల వద్ద నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించి, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారుగూడెం గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆశయాల వారధి అభివృద్ధి సారథి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్య

33 ఏళ్లుగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన అమరజీవి

ఆయన ఆశయాలను ఆచరణలో కొనసాగిస్తున్న దొడ్డ శ్రీనివాసరావు



అక్టోబర్ అక్టోబర్ 7, ప్రజా కలం న్యూస్

పేదలు,బడుగు బలహీన వర్గాల ప్రజల కష్టాలను ఆకళింపు చేసుకుని, వారి అభ్యున్నతే ధ్యేయంగా జీవితాంతం ప్రజా ఉద్యమాల్లో ముందుండి పోరాడిన అమరజీవి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్య ఆశయాలు నేటికీ వ్రజలకు స్ఫూర్తిదాయకమని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య అన్నారు. అన్నారుగూడెం స్వగ్రామంలో బుధవారం నిర్వహించిన కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్య 33వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.మూడు దశాబ్దాలకు పైగా కాలం గడిచినా దొడ్డ కృష్ణయ్యను ప్రజలు గుండెల్లో నిలుపుకోవడం ఆయన ప్రజల కోసం చేసిన సేవలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా సభకు తరలివచ్చిన అశేష జనవాహినే ఆయనపై ప్రజలకు ఉన్న అభిమానానికి ప్రత్యక్ష సాక్ష్యమని పేర్కొన్నారు.ప్రజల కష్టాలే తన కర్తవ్యంగా భావించిన నేత.నమ్ముకున్న సిద్ధాంతం కోసం అలుపెరగని పోరాటం సాగిస్తూ,సీపీఎం కార్యకర్తగా వివిధ హోదాల్లో పనిచేసిన దొడ్డ కృష్ణయ్య ప్రజలకు అండగా నిలిచారని సండ్ర వెంకట వీరయ్య అన్నారు.ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి,పేదల పక్షాన నిలబడటమే తన రాజకీయ బాధ్యతగా భావించిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. నిజమైన ప్రజాపాలనకు నిబద్ధతతో కూడిన నాయకత్వం అవసరమని నమ్మిన దొడ్డ కృష్ణయ్య,తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారని కొనియాడారు.తండ్రి ఆశయాలకు, అన్న స్ఫూర్తికి ప్రతిరూపంగా దొడ్డ శ్రీనివాసరావు.దివంగత నేత అమరజీవి దొడ్డ కృష్ణయ్య ఆశయాలను భుజాన వేసుకుని,ఆయన చూపిన ప్రజా సేవా మార్గంలో ముందుకు సాగుతున్న తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు ప్రజా జీవితంలో ప్రత్యేక ముద్ర వేస్తున్నారని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. తండ్రి అందించిన ఆశయాలను,అన్న దొడ్డ కృష్ణయ్య చూపిన ప్రజా సేవా స్ఫూర్తిని తన రాజకీయ ప్రస్థానానికి మార్గదర్శకంగా చేసుకుని దొడ్డ శ్రీనివాసరావు ప్రజల మధ్య నిరంతరం ఉంటున్నారని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం,ప్రజలకు అందుబాటులో ఉండటం ఆయన రాజకీయ జీవితంలో ప్రధాన లక్షణంగా నిలిచిందన్నారు. ఆశయమే ఆచరణగా,ప్రజా సేవే లక్ష్యంగా.దొడ్డ కృష్ణయ్య ఆశయాలను కేవలం స్మరించుకోవడమే కాకుండా వాటిని ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని భావిస్తూ దొడ్డ శ్రీనివాసరావు ముందుకు సాగుతున్నారని సండ్ర వెంకట వీరయ్య అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా,తన మొక్కవోని దీక్షతో ప్రజా జీవితంలో కొనసాగుతున్నారని తెలిపారు.ముందుగా అమర జీవి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దొడ్డ కృష్ణయ్య అమరహై అని నినాదాలు చేశారు. దొడ్డ కృష్ణయ్య ఆశయాలకు వారసుడిగా,ప్రజా సేవా ప్రస్థానానికి కొనసాగింపుగా దొడ్డ శ్రీనివానరావు నిలున్తున్నారని అన్నారు.తండ్రి దీవెనలు,అన్న ఆశయాలు,ప్రజల నమ్మకాన్ని తనకు బలంగా చేసుకుని మరింత ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్తున్నారని పేర్కొన్నారు.33 ఏళ్లుగా దొడ్డ కృష్ణయ్య జ్ఞాపకాలను గుండెల్లో పదిలంగా ఉంచుకున్న అన్నారుగూడెం ప్రజలు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న దొడ్డ శ్రీనివాసరావుకు అండగా నిలవడం ఈ వర్ధంతి సభ ప్రత్యేకతగా నిలిచిందని సండ్ర వెంకట వీరయ్య అన్నారు.

అనంతరం ప్రభుత్వ వైఫల్యాలపై ఆయన ధ్వజమెత్తారు. అభివృద్ధి ఊసే లేదు, ఏ ఒక్క హామీని నెరవేర్చలేక పోయారు,హామీలు విషయం అడిగితే అరెస్టులు పోలీస్ కేసులు,నిర్బంధాలు పూర్తిగా విఫలమైన ప్రభుత్వమని ఆయన ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు,స్థానిక సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి,ఆ పార్టీ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్,వార్డు మెంబర్స్,బాలపేట మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు, జొన్నలగడ్డ కిరణ్ బాబు,దగ్గుల శ్రీనివాసరెడ్డి,ఉప సర్పంచ్ లు శనక్కాయల సత్యనారాయణ, ఇంజం కృష్ణార్జునరావు, మాజీ ఉప సర్పంచ్ దిరిశాల నరసింహ రావు,మాజీ ఎంపీటీసీ ఆదూరి వెంకటేశ్వర్లు, యువజన నాయకులు ఎస్ ఎస్ రెడ్డి, సంఘసాని శ్రీను, వనిగండ్ల అశోక్,కొమ్మినేని శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఘోర నిర్లక్ష్యం

- గదిలోనే బాలుడిని ఉంచి తాళం వేసిన ఉపాధ్యాయులు.. హెచ్ఎం సస్పెండ్!



తానూర్ ,అక్టోబర్ 7(ప్రజా కలం): విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన ఉపాధ్యాయుల తీవ్ర నిర్లక్ష్యం కలకలం రేపింది, నిర్మల్ జిల్లా తానూర్ మండలం బెంబేర ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఈ ఘోరం వెలుగుచూసింది,పాఠశాల సమయం ముగిసే వేళకు, రెండో తరగతి చదువుతున్న భీమ్‌రావ్ అనే విద్యార్థి తరగతి గదిలోనే నిద్రపోయాడు, అయితే బాలుడు లోపల ఉన్న విషయాన్ని గమనించని ఉపాధ్యాయులు, సిబ్బంది గదికి తాళం వేసి ఇళ్లకు వెళ్లిపోయారు, సమయం దాటినా బాలుడు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు గ్రామం అంతటా వెతికారు,ఆ సమయంలో పాఠశాల వైపుగా వెళ్తున్న ఒక బాలుడికి, గదిలో నిద్రలేచి ఏడుస్తున్న భీమ్‌రావ్ శబ్దం వినిపించింది,కిటికీలోంచి చూడగా లోపల ఉన్న చిన్నారి కనిపించడంతో వెంటనే కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారం అందించాడు, గ్రామస్థులు వెంటనే వచ్చి తాళం తీసి బాలుడిని సురక్షితంగా బయటకు తీశారు,

ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో బుధవారం విద్యాశాఖ అధికారులు పాఠశాలలో విచారణ చేపట్టారు,విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు,విధుల్లో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలితో పాటు స్కావెంజర్‌ను కూడా సస్పెండ్ చేసినట్లు విద్యాధికారి వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఐడీ, ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ



ప్రజాకలం ప్రతినిధి, ఎటపాక, అక్టోబర్ 07 ఎటపాక మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మండల కమిటీ ఆధ్వర్యంలో ఐడీ కార్డులు, ఉచిత ప్రమాద బీమా కార్డులను బుధవారం పంపిణీ చేశారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సూచనల మేరకు ఎటపాక మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే అసలైన సైనికులని పేర్కొన్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. జగనన్న ప్రవేశపెట్టిన ఉచిత ప్రమాద బీమా విధానం ప్రతి కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పిస్తుందని అన్నారు. మండల కమిటీ నాయకులు, ముఖ్య నేతలు తమ చేతుల మీదుగా పార్టీ సభ్యులు, కార్యకర్తలకు ఐడీ, ఇన్సూరెన్స్ కార్డులను అందజేశారు. కార్డులు అందుకున్న కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ పార్టీ బలోపేతానికి మరింత ఉత్సాహంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎటపాక మండల అధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు (పెద్దోడు), రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు (బుజ్జి), మండల సోషల్ మీడియా కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు గుడిమల్ల నాగలక్ష్మి, యువజన విభాగం అధ్యక్షుడు తోట శశికుమార్ చల్లమని, పెనుబల్లి కోటేష్, పులుసు వంశీ, కాటం స్వరూప, సుజాత, వినోద్, నరేష్, భద్రయ్య, పాపారావు, సోడే ప్రసాద్, ఎడ్ల ప్రసాద్, పండు బాబు, నూతి రమేష్, బోయిన శీను, బాబురావు తదితర నాయకులు, కార్యకర్తలు, కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు.

మోదీ సేవకు గద్వాల జేజేలు!

- 25 ఏళ్ల ప్రజాసేవకు ఘన నివాళి..

- సేవా జ్యోతి యాత్రతో బీజేపీ శ్రేణుల సందడి

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 7 (ప్రజా కలం): ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని గద్వాల పట్టణంలో బీజేపీ శ్రేణులు ఘనంగా సేవా జ్యోతి యాత్ర నిర్వహించాయి. స్వర్ణకారుల ఫంక్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించి, ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రధాని మోదీ ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఓఎస్ రెడ్డి మాట్లాడుతూ.. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రజాసేవ ప్రారంభించిన నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా నిరంతరం ప్రజాసేవలో కొనసాగుతున్నారని అన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో మోదీ నాయకత్వం కీలకమన్నారు. అనంతరం జిల్లా యువ నాయకురాలు డీకే. స్నిగ్ధారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వర్ణకారుల ఫంక్షన్ హాల్ నుంచి గాంధీ చౌక్, వైఎస్సార్ చౌక్ మీదుగా మార్కెట్ రోడ్డు వరకు సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా డీకే. స్నిగ్ధారెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి భారత్‌ను వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'మేం చేసి తీరుతాం' అనే సంకల్పంతో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు గుర్తింపుగా ర్యాలీ నిర్వహించిన ప్రాంతానికి 'సేవా జ్యోతి చౌరస్తా'గా నామకరణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మహిళా మోర్చా, బీజేవైఎం, కిసాన్ మోర్చా, ఓబీసీ మోర్చా నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పెన్షన్లపై అధికారుల ఆరా! : డీపీఓ శ్రీకాంత్

పెద్దతండలో లబ్ధిదారుల వివరాల పరిశీలన



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 7 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా పెద్దతండ గ్రామపంచాయతీ పరిధిలో పెన్షన్ లబ్ధిదారుల వివరాల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీపీఓ శ్రీకాంత్, సర్పంచ్ ఎం. నార్య నాయక్ ఆధ్వర్యంలో అధికారులు లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాలు, అర్హతలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ అందేలా వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎం. నార్య నాయక్ మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. పెన్షన్ వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ, గ్రామపంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రప్ప తండాలో పోషణ మాసం వేడుకలు

పోషకాహారం,ఆరోగ్యం,పరిశుభ్రతపై అవగాహన



ప్రజా కలం న్యూస్/ మరిపెడ ప్రతినిధి అక్టోబర్ 7 మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఉల్లేపల్లి సెక్టార్ పరిధిలోని గుర్రప్ప తండాలో బుధవారం పోషణ మాసం వేడుకలను ఘనంగా నిర్వహించారు.అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పోషకాహారం,ఆరోగ్యం,పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ చిన్నారులు,గర్భిణులు,బాలింతలు పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.పోషణ మాసం లక్ష్యాలను ప్రజలకు వివరించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు.కార్యక్రమంలో గుర్రప్ప తండా సర్పంచ్ బానోత్ శరత్,ఉల్లేపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు,లబ్ధిదారులు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు..

బాధిత యువతికి న్యాయం జరిగే వరకు పోరాటం

- మున్సిపల్ చైర్మన్ సారంగపాణి రాజీనామా చేయాలి.
- ఈరెల్లీ శ్రీనివాస్ మాదిగ



అక్టోబర్ 7 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్దన్నపేట) బాధిత దళిత యువతికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి తన పదవికి రాజీనామా చేయాలని మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు ఈరెల్లీ శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. బాధిత యువతి న్యాయం కోసం చైర్మన్ ఇంటి ఎదుట నిరసన చేపట్టి 48 గంటలు గడిచినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధి అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. తన కుమారుడిపై ఆరోపణలు ఎదురవుతున్న ఘటనలో బాధితురాలికి న్యాయం జరిగేలా చొరవ చూపాల్సిన బాధ్యత చైర్మన్‌పై ఉందన్నారు.చైర్మన్ పదవి అంటే ప్రజలందరికీ సమానంగా అండగా నిలవడమేనని, బాధితురాలికి న్యాయం జరిగేలా నిలబడలేని పరిస్థితి ఉంటే పదవిలో కొనసాగడం ఎందుకని ప్రశ్నించారు. వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వెంటనే స్పందించి, దళిత యువతికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ మాదిగ కోరారు. పదవి కంటే న్యాయం, బంధుత్వం కంటే బాధితురాలి న్యాయమే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈరెల్లీ శ్రీనివాస్ మాదిగ, మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు.

కానిస్టేబుల్ అశోక్ కుటుంబాన్ని పరామర్శించిన దళిత సంఘాల నాయకులు.

(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 07, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండలంలోని



దోలత్ నగర్ గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఐలపాక అశోక్ తండ్రి ఐలయ్య ఇటీవల మృతి చెందిగా బుధవారం వారి ఇంటికి వెళ్లి మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, అశోక్ కుటుంబాన్ని ప్రగాఢ సానుభూతి వ్యక్తం వ్యక్తం చేసిన దళిత సంఘాల నాయకులు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జన్ను నరసయ్య, వరంగల్ జిల్లా కోకన్వీనర్ జంగిలి భాస్కర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయక్ జిల్లా ధర్మయ్య, నాయకులు దబేట గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గళం నుంచి వెండితెరకు ఎంట్రీ

20 ఏళ్ల పోరాటానికి వెండితెర గుర్తింపు – భారీ గిరిజన చిత్రంలో మద్దిశెట్టి సామేలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: అక్టోబర్ 07: (ప్రజా కలం న్యూస్)

ఏజెన్సీ గడ్డపై ఆదివాసీల హక్కుల కోసం, గిరిజన బహుజనుల ఆత్మగౌరవం కోసం గత 20 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్న ప్రజా నాయకుడు, ఎన్సీపీ పార్టీ, ఎన్డీఏ మహాకూటమి, ఎన్సీసీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యవర్గ సభ్యులు మద్దిశెట్టి సామేలు జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది.ఇన్నాళ్లూ ప్రజల కోసం పోరాటం చేసిన మద్దిశెట్టి సామేలు, ఇప్పుడు వెండితెరపై అడుగుపెడుతున్నారు. ఆదివాసీల నిజ జీవితాన్ని, వారి కష్టాలను, పోరాటాలను యథాతథంగా చూపించేందుకు ప్రముఖ దర్శక నిర్మాత జితేంద్ర యాదగిరి మరియు 370కి పైగా చిత్రాల్లో నటించి 'రియల్ స్టార్', 'రియల్ హీరో'గా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న అప్సర్ ఆజాద్ సంయుక్తంగా ఓ భారీ గిరిజన చిత్రాన్ని నిర్మించబోతున్నారు.

హైదరాబాద్‌లో సినిమా డైరెక్టర్‌తో ఆత్మీయ భేటీ

హైదరాబాద్‌లోని సినిమా డైరెక్టర్ కార్యాలయంలో మద్దిశెట్టి సామేలు దర్శక నిర్మాతలను కలిశారు.ఈ సందర్భంగా మద్దిశెట్టి సామేలును శాలువాతో, పూలదండలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సినిమా కథను డైరెక్టర్ జితేంద్ర యాదగిరి, అప్సర్‌ఆజాద్,మద్దిశెట్టి సామేలు కలిసి చర్చించారు.

అన్నదమ్ముల అనుబంధమే ప్రాణం


ఈ చిత్రంలో అన్నదమ్ముల అనుబంధమే ప్రధాన కథాంశం కానుంది. ఇందులో సీనియర్ నటుడు, రియల్ హీరో అప్సర్ ఆజాద్ అన్నయ్య పాత్రలో నటిస్తుండగా, మద్దిశెట్టి సామేలు తమ్ముడి పాత్రలో నటిస్తున్నారు ఇద్దరు హీరోలుగా సిల్వర్ స్క్రీన్ పై సందడి చేయనున్నారు. అన్న అడవిని, తమ్ముడు హక్కులను కాపాడటం కోసం చేసే పోరాటమే ఈ చిత్ర కథ.

భద్రాచలం నుంచి అరకు దాకా

ఈ చిత్రం షూటింగ్ వచ్చే నెల మొదటి వారంలో ఘనంగా ప్రారంభం కానుంది. కథలో సహజత్వం కోసం, ఆదివాసీ సంస్కృతిని అద్భుతంగా చూపించడం కోసం షూటింగ్ మొత్తం ఏజెన్సీ అడవుల్లోనే చేయాలని దర్శకుడు జితేంద్ర యాదగిరి నిర్ణయించారు. ముఖ్యంగా పవిత్ర పుణ్యక్షేత్రాలైన భద్రాచలం, మారేడుమిల్లి అడవులు, అరకులోయ, మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణం, గుబ్బల మంగమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో భారీ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు.ఇన్నేళ్లుగా ప్రజల మనిషిగా ఉన్న సామేలు ఇప్పుడు వెండితెరపై కూడా తమ గోడును వినిపిస్తారని, గిరిజన బిడ్డలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తారని ఏజెన్సీ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీరెల్లి పంచాయతీలో పాత పేర్లే.. అధికారులు ఏం చేస్తున్నారు?

సర్పంచ్ పేరు లేదు.. వార్డు సభ్యుల వివరాలు లేవు.. అధికారుల పేర్లూ లేవు



గద్వాల, అక్టోబర్ 7 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం బీరెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్వహణ తీరుపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త పాలకవర్గం ఏర్పడినప్పటికీ పంచాయతీ కార్యాలయంలో పాత సర్పంచ్ పేర్లు, పాత వివరాలే కొనసాగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుత పాలకవర్గానికి సంబంధించిన పూర్తి వివరాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఎవరిని కలవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

సర్పంచ్ పేరు లేదు.. వార్డు సభ్యుల పేర్లూ లేవు!

పంచాయతీ కార్యాలయంలో ప్రస్తుత సర్పంచ్ పేరు, ఫోన్ నంబర్‌తో పాటు వార్డు సభ్యుల పేర్లు, వారి వార్డు నంబర్లు, సంప్రదింపు వివరాలు కూడా స్పష్టంగా ప్రదర్శించలేదని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో తమ వార్డుకు సంబంధించిన సమస్యను ఎవరికి చెప్పాలి, గ్రామ సమస్యలపై ఎవరిని సంప్రదించాలి అనే విషయం ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొందని వారు పేర్కొంటున్నారు.

అధికారుల వివరాలు ఎక్కడ?

పంచాయతీ కార్యదర్శి, సంబంధిత పంచాయతీ అధికారులు, ఉన్నతాధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు వంటి వివరాలు కూడా ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయలేదని గ్రామస్థులు తెలిపారు. సమస్య వచ్చినప్పుడు ఎవరిని సంప్రదించాలో తెలియక ప్రజలు ఒకరి దగ్గర నుంచి మరొకరి దగ్గరకు తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత జిల్లా పేరు ఇంకా ఎందుకు?

వంచాయతీ కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాలం నాటి వివరాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం జోగులాంబ గద్వాల జిల్లా ఏర్పడి చాలా కాలం గడిచినా పాత జిల్లా పేరు, పాత వివరాలను మార్చకపోవడంపై వారు ప్రశ్నిస్తున్నారు. కొత్త పాలకవర్గం ఏర్పడిన తర్వాత కూడా కార్యాలయంలో వివరాలు ఎందుకు నవీకరించలేదని, పంచాయతీ కార్యాలయాన్ని పర్యవేక్షించే అధికారులు ఈ విషయాన్ని ఎందుకు గుర్తించలేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

కార్యదర్శి అందుబాటులో.. సర్పంచ్ మాత్రం?

వంచాయతీ కార్యదర్శి కార్యాలయంలో అందుబాటులో ఉంటున్నారని గ్రామస్థులు తెలిపారు. అయితే సర్పంచ్ మాత్రం పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదని వారు పేర్కొన్నారు. సర్పంచ్ అందుబాటులో ఉండే సమయం, ఫోన్ నంబర్‌ను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని కోరుతున్నారు.

ప్రజలకు సమాచారం లేక అయోమయం

ప్రజలకు సేవలందించాల్సిన వంచాయతీ కార్యాలయంలోనే ప్రస్తుత సర్పంచ్, వార్డు సభ్యులు, కార్యదర్శి, సంబంధిత అధికారుల వివరాలు లేకపోవడం వల్ల ప్రజలు ఎవరిని కలవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారని గ్రామస్థులు అంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, వివిధ సమస్యలతో పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలు సరైన వ్యక్తిని సంప్రదించేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

పంచాయతీ భవన నిర్వహణపై కూడా ప్రశ్నలు


పంచాయతీ కార్యాలయ భవనానికి అవసరమైన పెయింటింగ్, సమాచార బోర్డుల నవీకరణ వంటి నిర్వహణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు అవసరమైన సమాచారం స్పష్టంగా కనిపించేలా ప్రత్యేక సమాచార బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టి సారించాలి

బీరెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్వహణపై జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రస్తుత సర్పంచ్ పేరు, వార్డు సభ్యుల పూర్తి వివరాలు, పంచాయతీ కార్యదర్శి పేరు, సంబంధిత అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు, కార్యాలయ సమయాలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి బీరెల్లి పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి, పాత వివరాలను తొలగించి ప్రస్తుత పాలకవర్గం మరియు అధికారుల పూర్తి వివరాలను అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పాలో స్పష్టత వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సేంద్రీయ పద్ధతులతోనే నాణ్యమైన పత్తి దిగుబడి

సస్యరక్షణలో రసాయనాలు తగ్గించాలి -ప్రపంచ పత్తి దినోత్సవంలో ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ పీయూ మేనేజర్ మృదుల



అక్టోబరు 7 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్దన్నపేట)

రైతులు సస్యరక్షణలో రసాయనాల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారానే నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేయవచ్చని ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ పర్వతగిరి పీయూ మేనేజర్ గట్టిక మృదుల పేర్కొన్నారు. ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వర్దన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ (డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్) – బీసీఐ (బిసి ఐ) ప్రాజెక్టులో భాగంగా, ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మేనేజర్ మృదుల మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వస్త్ర పరిశ్రమకే కాకుండా వైద్య సామాగ్రి, నూనెలు, పశుగ్రాసం తయారీలో పత్తి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పత్తి ఉత్పత్తిలో రైతులు అందిస్తున్న సహకారాన్ని ప్రపంచం ఎల్లప్పుడూ గౌరవిస్తుందని తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించడానికి వర్మి కంపోస్ట్, సిటీ కాంపోస్ట్, జీవ సంబంధిత కషాయాలను వినియోగించాలని సూచించారు. దీనివల్ల పత్తి నాణ్యత పెరగడమే కాకుండా జీవవైవిధ్యం (బయోడైవర్సిటీ) పెంపొందుతుందని అన్నారు.మానవ జీవనశైలికి నాణ్యమైన గాలి, ఆహారం, నివాసం ఎంతో ముఖ్యమని, వ్యవసాయంలో కాలుష్యాన్ని తగ్గించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పత్తి ఏరేటప్పుడు చెత్తాచెదారం, రాళ్ళు, తల వెంట్రుకలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే నిల్వ చేసే సమయంలోనూ, రవాణా క్రమంలోనూ తగిన మెళకువలు పాటించాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ సంస్థ ప్రతినిధులు స్కైలాబ్ బాబు, వెంకన్న, బద్రునాయక్, సుజాత, మౌనిక, మమత, సరస్వతిలతో పాటు స్థానిక రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేవకు గుర్తింపు.. సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం అందించాలి

- గవర్నర్ కోటాలో డా. పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలి
- కాంగ్రెస్ కోసం నిబద్ధతతో పనిచేశారు.. పేదల వైద్యుడిగా ప్రజాసేవలో ముందున్నారు
- లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్ నాయక్ డిమాండ్

హన్మకొండ, అక్టోబర్ 7: (ప్రజా కలం ప్రతినిధి)మాదిగ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం పెంచే దిశగా గవర్నర్ కోటాలో ప్రముఖ వైద్యులు, ప్రజాసేవకులు డా. పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని



లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్ నాయక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఎన్ఎస్‌యూఐ నుంచి కాంగ్రెస్ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన డా. రామకృష్ణ అనేక సంవత్సరాలుగా పార్టీలో కొనసాగుతూ ప్రజా సమస్యలు, దళిత-బహుజన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో పార్టీ టికెట్ లభించకపోయినా కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను నాయకత్వం గుర్తించాలని కోరారు. రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలు, బలహీన వర్గాలకు వైద్య, సామాజిక సేవలు అందిస్తూ ప్రజల్లో గుర్తింపు పొందారని తెలిపారు. వైద్య రంగంలో అనుభవంతో పాటు ప్రజా సమస్యలపై ఉద్యమకారుడిగా, దళిత-బహుజన వర్గాల గొంతుకగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. డా. రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే మాదిగలతో పాటు పేదలు, దళిత--బహుజన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందని అజ్మీర వెంకట్ నాయక్ అన్నారు. ఆయన సేవలు, పార్టీ పట్ల నిబద్ధతను పరిగణనలోకి తీసుకొని అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బానోతు లక్ష్మణ్ నాయక్, భాస్కర్ నాయక్, పంతుల్య వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థికి గురుకులంలో అడ్మిషన్



(వరంగల్/ నల్లబెల్లి) అక్టోబర్ 07, ప్రజాకలం ప్రతినిధి:

అనాథగా మారిన విద్యార్థికి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో అడ్మిషన్ కల్పించారు. గూడూరు మండలం మర్రిమిట్ట గ్రామానికి చెందిన దళిత కుటుంబానికి చెందిన కల్లేపల్లి రమ, శ్రీను దంపతులు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుమారుడు కల్లేపల్లి రమణ మామపెల్లి మధు అనాథగా మారాడు. విద్యార్థి పరిస్థితిని ఏబివిఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ మాజీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్, ఎంజెపి సెక్రెటరీ సైదులు, ఐఎఫ్ఎస్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సెక్రెటరీ నల్లబెల్లి మండలం గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో విద్యార్థికి అడ్మిషన్ కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి తరపు బంధువులు సెక్రెటరీ సైదులు, ఆర్సిఓ శ్రావణ్ కుమార్, ప్రిన్సిపాల్ మల్లయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి బంధువులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి 108 సిబ్బంది సత్వర సేవలు

-హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని ప్రథమ చికిత్స.. ఎంజీఎంకు తరలింపు.



అక్టోబర్ 7 ప్రజాకలం ప్రతినిధి:(హన్మకొండ)

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి 108 సిబ్బంది సకాలంలో స్పందించి వైద్యసేవలు అందించారు. హన్మకొండ జిల్లా జాన్‌పాక్ కావేరి బ్రిడ్జి వద్ద క్రిస్టియన్ కాలనీకి చెందిన గుండేటి వంశీ బైక్‌పై వెళ్తుండగా అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వంశీ ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాదాన్ని గమనించిన పాదచారులు వెంటనే 108కు సమాచారం అందించారు. స్పందించిన 108 ఈఎంటీ నాగరాజు, పైలట్ అమర్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వంశీని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.సమయస్ఫూర్తితో స్పందించి ప్రమాద బాధితుడిని ఆస్పత్రికి తరలించిన 108 సిబ్బంది సేవలను పలువురు పాదచారులు, స్థానికులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

శారీలో తాప్సీ పన్ను..



టాలెంటెడ్ బ్యూటీ తాప్సీ పన్ను తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. "ది గ్లో అండ్ ది గేజ్. ఆ చూపులు అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ ఆకట్టుకుంటుంది. సినిమాల పరంగా వరుస విజయాలు అందుకుంటూ, అటు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన శైలిలో దూసుకుపోతున్న ఈ భామ.. తాజాగా ఐవరీ షాంపైన్-గోల్డ్ శారీలో అచ్చం అప్సరసలా మెరిసిపోతూ కుర్రకారును కట్టిపడేస్తోంది. ప్రస్తుతం ఈ అందమైన ఫోటోషూట్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.ఆ విశేషాలు చూద్దాం.. తాజా ఫోటోషూట్ కోసం తాప్సీ పన్ను ఎగసిపడే కెరపాల వంటి ప్రవాహంలాంటి ఐవరీ షాంపైన్-గోల్డ్ ఫ్యూర్ టిష్యూ ఆర్గాంజా చీరను ఎంచుకుంది. పల్లు మరియు అంచుల వెంబడి దట్టంగా అల్లిన మెరిసే గోల్డ్-ఎంబ్రాయిడరీ స్టేట్‌మెంట్ బార్డర్ ఈ చీరను మరింత రాయల్‌గా మార్చింది. ఇక దీనికి సరిగ్గా సరిపోయేలా స్ట్రాప్‌లెస్, హెవీగా ఎంబెర్నింగ్ చేసిన స్వీట్‌హార్ట్ కార్సెట్ చోలీ ధరించి అద్భుతమైన మోడ్రన్ టచ్ ఇచ్చింది. ఈ ట్రెడిషనల్ అండ్ మోడ్రన్ ఫ్యూజన్ లుక్‌ను మరింత హైలైట్ చేయడానికి తాప్సీ ప్రత్యేకమైన ఆభరణాలను ఎంచుకుంది. భారీ ఎథ్నిక్ ఇయర్ రింగ్స్, చేతికి గోల్డ్ మ్యాచింగ్ బ్రాస్‌లెట్ అలాగే చేతిలో మెటాలిక్ గోల్డ్ క్లచ్ బ్యాగ్ ధరించి పర్ఫెక్ట్ రిచ్ లుక్‌లో కనిపించింది. ఇక ఆమె గ్లోయింగ్ మేకప్, కాన్ఫిడెంట్ లుక్ చూసి ఫిదా అయిన ఫ్యాన్స్ "ప్రిటీయెస్ట్", "గార్జియస్", "ఎలిగెంట్ అండ్ క్లాసిసి బ్యూటీ", "లుకింగ్ నైస్లీ" అంటూ కామెంట్లతో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

చేతిలో గులాబీ పువ్వుతో తెర వెనుక నిలబడ్డాను!



తొంభైల దశకంలో గోవిందా-కరిష్మా కపూర్ జోడీ బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సునామీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం కెమెరాకే పరిమితం కాలేదు. ఇండస్ట్రీలోకి రాకముందు చేతిలో గులాబీ పువ్వుతో ఓ సాధారణ అభిమానిలా తెర వెనుక నిలబడి గోవిందా డ్యాన్స్‌ను ఆరాధిం చిన అరుదైన జ్ఞాపకాన్ని కరిష్మా కపూర్ తాజాగా గుర్తు చేసుకున్నారు. కరిష్మా ఇండస్ట్రీలోకి రాకముందు జరిగిన ఓ స్టేజ్ షో లో గోవిందాను మొదటిసారి చూసానన్నారు. ఆ సమయంలో గోవిందా వేదికపై అప్పటి స్టార్ హీరోయిన్ నీలం కొఠారితో కలిసి -స్టీట్ డ్యాన్సర్- పాటకు అద్భుతంగా డ్యాన్స్ చేస్తున్నారు. ఆ ప్రదర్శన సమయంలో తాను వేదిక వెనుక చేతిలో గులాబీ పువ్వు పట్టుకుని నిలబడ్డానని కరిష్మా చెప్పుకొచ్చారు. వేదిక వెలుపల నుంచి తెరల చాటుగా తొంగి చూస్తూ గోవిందా డ్యాన్స్‌ను ఎంతగానో ఆస్వాదించానని గుర్తు చేసుకున్నారు. అప్పట్లోనే గోవిందా డ్యాన్స్ స్టెప్పులకు, ఎనర్జీకి తాను ఫిదా అయ్యానని తెలిపారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకే కరిష్మా కపూర్ బాలీవుడ్‌లో నటిగా అడుగుపెట్టారు. అనుకోకుండా అదే గోవిందాతో స్క్రీన్ షేర్ చేసుకునే అద్భుతమైన అవకాశం లభించింది. తొలి రోజుల్లో ఒక అభిమానిలా గోవిందా డ్యాన్స్‌ను తెర వెనుక నుంచి చూసిన తాను కొద్ది కాలంలోనే ఆయన సరసన కథానాయికగా నటించడం అదృష్టంగా భావించానని కరిష్మా పేర్కొన్నారు. గోవిందా- కరిష్మా కపూర్ కలయికలో వచ్చిన రాజా బాబు, కూలీ నెం. 1, హీరో నెం. 1 వంటి చిత్రాలు అప్పట్లో సంచలన విజయాలు సాధించాయి. ఇద్దరి మధ్య ఉన్న ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ, కామిక్ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నేటికీ ఈ జోడీకి సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. సినిమాల పరంగా బిజీగా ఉన్నా? పాత జ్ఞాపకాలను, తోటి నటులతో ఉన్న అనుబంధాన్ని కరిష్మా కపూర్ ఇలా అభిమానులతో పంచుకోవడం విశేషం. ఒకప్పటి ఆ మధురమైన జ్ఞాపకం తన మనసులో ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతుందని తెలిపారు. కేవలం ఆన్-స్క్రీన్ జోడీగానే కాకుండా ఇండస్ట్రీలో ఒకరిపై ఒకరు చూపించుకునే ఈ రకమైన అంతులేని గౌరవం, అపురూపమైన ప్రయాణమే తారలను నేటికీ ప్రేక్షకులకు మరింత చేరువ చేస్తోంది. తారల మధ్య ఉండే ఇలాంటి వ్యక్తిగత భావోద్వేగాలు, నాస్టాల్జిక్ జ్ఞాపకాలే సినిమా చరిత్రలో కొన్ని కాంబినేషన్లను ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచేలా చేస్తాయి.

అనుపమ క్యూట్ స్టైల్..



టాలీవుడ్ క్యూట్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న ట్రెడిషనల్ ఫోటోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. పచ్చని ప్రకృతి నడుమ, తనదైన చిరునవ్వుతో ఆమె దిగిన పిక్స్ నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వైబ్రెంట్ గ్రీన్ సిల్క్ శారీలో అచ్చం పక్కింటి అమ్మాయిలా కనిపిస్తూ, కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్న ఈ అందమైన ఫోటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

గ్రీన్ సిల్క్ శారీ అండ్ ఎమరాల్డ్ టోన్స్ : తాజా ఫోటోషూట్ కోసం అనుపమ పరమేశ్వరన్ అ ద్భుతమైన ఎమరాల్డ్ గ్రీన్ చీరను ఎంచుకుంది. డ్యూయల్-టోన్ టెక్స్చర్‌తో పాటు చీర అంతటా సన్నని గోల్డెన్ హరిజాంటల్ స్ట్రిప్స్, అంచుల వెంబడి వెడల్పాటి గోల్డ్ బార్డర్ ఉన్న ఈ చీర ఆమెకు రాయల్ లుక్‌ను తెచ్చిపెట్టింది. ఇక దీనికి మ్యాచిం గ్‌గా క్లోజ్-నెక్, ఎల్బో-లెంత్ బ్లౌజ్ ధరించి ఎంతో పద్ధతిగా, కనిపించింది.





పెద్దమ్మ తండాను అభివృద్ధి చేయడమే లక్ష్యం

పెద్దమ్మ తండాలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన పెద్దమ్మ తండా గ్రామ సర్పంచ్ నేనావత్ రవి నాయక్ ఉప సర్పంచ్ కిషన్ నాయక్

మహేశ్వరం, అక్టోబర్ 07, (ప్రజా కలం)

మహేశ్వర మండలం పెద్దమ్మ తండా గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పెద్దమ్మ తండా గ్రామ సర్పంచ్ నేనావత్ రవి నాయక్ అన్నారు. బుధవారం నాడు పెద్దమ్మ తండా గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ నేనావత్ రవి నాయక్, ఉప సర్పంచ్ కిషన్ నాయక్ లు కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రవి నాయక్ మాట్లాడుతూ... గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, దశలవారీగా అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతామని తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అలీబాబా 40 దొంగల మాదిరిగా రేవంత్ పాలన: వంటేరు ప్రతాప్ రెడ్డి

- ఫామ్‌హౌస్ చుట్టూ గిరి ప్రదక్షిణలేనా? రేవంత్ పాలనపై వంటేరు ఫైర్

- వెయ్యి రోజుల పాలనలో ఏం సాధించారు?- రేవంత్‌రెడ్డిని నిలదీసిన వంటేరు

ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు గచ్చిబౌలిలో 200 ఎకరాలు కేటాయించి మోడల్ కాలనీ నిర్మించాలి



గజ్వేల్: అక్టోబర్ 7 (ప్రజా కలం ప్రతినిధి):

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలను పక్కనపెట్టి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,ఆయన ఫామ్‌హౌస్ చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.బుధవారం గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలు,ఉద్యమకారుల కోసం హైదరాబాద్ గచ్చిబౌలిలో 200 ఎకరాల భూమిని కేటాయించాలని వంటేరు డిమాండ్ చేశారు. ఆ భూమిలో లేఅవుట్ చేసి ప్లాట్లు ఇవ్వడంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి మోడల్ కాలనీగా అభివృద్ధి చేసి ఉద్యమకారులు,అమరవీరుల కుటుంబాలకు అందించాలని కోరారు.

సర్వే నంబర్ 325పై వంటేరు వ్యాఖ్యలు

ఎర్రవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో రెవెన్యూ అధికారులు తొమ్మిది రోజుల పాటు సర్వే నిర్వహించారని వంటేరు తెలిపారు. ఆ సర్వేలో ఒక్క గజం భూమి కూడా కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో లేదని అధికారులు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. 1976లో సర్వే నంబర్ 325కు సంబంధించిన ఓవర్‌ల్యాప్ ఆధారంగా గ్రామ మ్యాప్ రూపొందించారని తెలిపారు. 388 ఎకరాల భూమిలో 244 మంది వివిధ కులాలకు చెందిన రైతులు కబ్జాలో ఉండి సాగు చేస్తున్నారని సర్వే అధికారులు తెలిపినట్లు వంటేరు పేర్కొన్నారు.ఈ అంశంపై వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసిన వంటేరు

ఆరు గ్యారెంటీలు,13 డిక్లరేషన్లతో పాటు రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని వంటేరు అన్నారు. విద్యుత్ సమస్యపై రైతులు రాస్తారోకోలు,ధర్నాలు, సబ్‌స్టేషన్ల ముట్టడికి దిగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన విమర్శించారు.ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పాలన 'కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు' ఉందని వ్యాఖ్యానించారు.హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ పాలనను ప్రస్తావించిన వంటేరు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ వంటి ప్రాజెక్టులు నిర్మించారని వంటేరు పేర్కొన్నారు.మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా,రైతులకు పెట్టుబడి సాయం,24 గంటల ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేశారని అన్నారు.కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారని,33 జిల్లాలు, కొత్త మండలాలు,గ్రామ పంచాయతీల ఏర్పాటు,జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్‌లు, వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించేందుకు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారని,యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని పునర్నిర్మించారని పేర్కొన్నారు.'కేసీఆర్ మార్క్ డెవలప్‌మెంట్'గా పేర్కొన్న ఈ కార్యక్రమాలతో పోలిస్తే రేవంత్‌రెడ్డి మార్క్ ఏమిటని వంటేరు ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం భారీగా అప్పులు చేసిందని ఆరోపిస్తూ, కొత్త ప్రాజెక్టులు,అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'అలీబాబా 40 దొంగలు' అంటూ విమర్శ

హైదరాబాద్‌లో 22(ఎ) భూముల వ్యవహారాన్ని ప్రస్తావించిన వంటేరు.. రేవంత్‌రెడ్డి చుట్టూ ఉన్న కొందరు వ్యక్తుల పేర్లను ప్రస్తావిస్తూ తీవ్ర ఆరోపణలు చేశారు. 'అలీబాబా 40 దొంగలు' మాదిరిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌ను దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని వంటేరు అన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి,అక్రమంగా సంపాదించిన సొమ్మును వెలికితీసి ప్రజలకు తిరిగి అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ఫామ్‌హౌస్ రాజకీయాలను పక్కనపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలు,ఆరు గ్యారెంటీలు,13 డిక్లరేషన్లను అమలు చేయాలని, రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాస శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ గూడెం కృష్ణారెడ్డి,నాయకులు రఘుపతిరెడ్డి, పాల రమేష్‌గౌడ్,హరీష్,అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి 17 ఇంటర్ ఛేంజ్ లు

నెల్లూరు : అమరావతి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే నగరం భవిష్యత్తును ముందుగానే గురించి ఏకంగా 17 చోట్ల ఇంటర్ చేంజ్ లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా 189.93 కిలోమీటర్ల మేర ఆరు వరసలతో ఈ రోడ్డు నిర్మిస్తున్నా రు. మొత్తంగా యాక్సిస్ కంట్రోల్ ఓ ఆర్ ఆర్ లోకి వాహనాలు ప్రవేశించాలి అంటే. . అందులో నుంచి బయటికి రావాలంటే సరే ఇంటర్ చేంజ్ ల వద్ద మాత్రమే అవకాశం ఉంటుంది. ఔటర్ రింగ్ రోడ్డు 6 జాతీయ రహదారులను క్రాస్ చేస్తుంది. వీటిలో 8 చోట్ల డబుల్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ లు నిర్మిస్తున్నా రు. రాష్ట్ర.. జిల్లా రోడ్లను క్రాస్ చేసే ప్రాంతాలలో సింగిల్ ఇంటర్ చేంజ్.. 8 రోటరీ ఇంటర్ చేంజ్ లు నిర్మించ బోతున్నారు.గతంలో 19 ప్రాంతాలలో ఇంటర్ చేంజ్ లు నిర్మించాలని అనుకున్నారు. ప్రాజెక్టు ఖర్చు మొత్తం 38,450 కోట్లు ఉండడంతో.. దీనిని తగ్గించాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో.. మళ్లీ మార్పులు చేశారు.. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వైపు మాత్రమే సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు. బయటి వైపు సర్వీస్ రోడ్ల ప్రతిపాదనను పూర్తిగా తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు అలాగే ఔటర్ రింగ్ రోడ్ లో తెనాలి సమీప నుంచి చెన్నై, కోల్కతా హైవేలో కాజా వరకు దాదాపు 17.5 కిలోమీటర్ల మేర ఆరు వరుసల లో అనుసంధాన రహదారి నిర్మాణాన్ని కూడా పక్కన పెట్టారు. ఫలితంగా రెండు ఇంటర్ చేంజ్ లు తొలగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనివల్ల ఇంటర్ చేంజ్ ల సంఖ్య 17 కు తగ్గింది. మొత్తానికి ప్రాజెక్టు ఖర్చు కూడా 30, 491 కోట్లకు పరిమితమైంది.


ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలంటే

మొదటి ఇంటర్ చేంజ్

కంచికచర్ల నుంచి విజయవాడ హైదరా బాద్ హైవే మీద దీన్ని నిర్మిస్తారు. ఇక్క డ డబుల్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ నిర్మి స్తామని అధికారులు చెబుతున్నారు?

రెండవ ఇంటర్ చేంజ్.

కంచికచర్ల మధిర స్టేట్ హైవే క్రాస్ అయ్యే చోట పొన్నవరానికి సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డు లోని 3.90 కిలోమీటర్ వద్ద దీనిని నిర్మిస్తారు.



మూడవ ఇంటర్ చేంజ్

విజయవాడ ఖమ్మం నాగపూర్ జాతీయ రహదారి క్రాస్ అయ్యే చోట దుగ్గిరాలపాడు సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డు లోని 18.30 కిలోమీటర్ వద్ద డబుల్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ నిర్మించబోతున్నారు.

నాలుగవ ఇంటర్ చేంజ్.. ఇబ్రహీంప ట్నం నుంచి భద్రాచలం మీదుగా ఉ త్తరాఖండ్ వెళ్లే హైవే దగ్గర్లోని డబుల్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ నిర్మిస్తారు. ఇది ఔటర్ రింగ్ రోడ్డు లోని 31.29 కిలోమీటర్ల వద్ద ఉంటుంది. మైలవరం ప్రాంతానికి సమీపంలో ఉంటుంది.

ఐదవ ఇంటర్ చేంజ్

ఔటర్ రింగ్ రోడ్ లోని 42.50 కిలోమీ టర్ వద్ద దీనిని నిర్మిస్తారు. ఇది అడవి నెక్కలం. వెల్వడం రోడ్డు పరిధిలో ఉ ంటుంది.

ఆరవ ఇంటర్ చేంజ్

అగిరిపల్లి సమీపంలో దీనిని నిర్మిస్తా రు. ఔటర్ రింగ్ రోడ్ లోని 47.80 కిలోమీటర్ వద్ద దీనిని నిర్మిస్తారు. ఇది విజయవాడ.. నూజివీడు క్రాస్ దగ్గర నిర్మాణం అవుతుంది.

ఏడవ ఇంటర్ చేంజ్

చెన్నై కోల్కతా హైవేలో పొట్టిపాడు దగ్గర దీని నిర్మిస్తారు. ఔటర్ రింగ్ రోడ్ లోని 66.1 0 కిలోమీటర్ వద్ద ఇది నిర్మాణం అవుతుంది ..

ఎనిమిదవ ఇంటర్ చేంజ్

గన్నవరం పుట్టగుంట రోడ్డు క్రాస్ అయ్యే ప్రాంతంలో దీన్ని నిర్మిస్తారు

9వ ఇంటర్ చేంజ్

విజయవాడ గుడివాడ సమీపంలో ఉ న్న మానికొండ వద్ద దీని నిర్మిస్తారు.

10వ ఇంటర్ చేంజ్

విజయవాడలోని మచిలీపట్నం హైవే దగ్గర్లో చలివేంద్రపాలెం ప్రాంతంలో ఇక్కడ డబుల్ ట్రంపెట్ నిర్మిస్తారు.

11వ ఇంటర్ చేంజ్..

గుంటూరులోని హనుమాన్ పాలెం రోడ్డు దగ్గర నందివెలుగు ప్రాంతంలో ఇక్కడ ఇంటర్ చేంజ్ నిర్మిస్తారు?

12వ ఇంటర్ చేంజ్

నారాకోడూరు ప్రాంతంలోని బుడంపాడు సమీపంలో డబుల్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ నిర్మిస్తారు?

13వ ఇంటర్ చేంజ్

అనంతవరప్పాడు మట్లూరు రోడ్డు ప్రాంతంలో దీనిని నిర్మిస్తారు. దీనిని పూర్తిగా రోటరీ ఇంటర్ చేంజ్ విధానంలో నిర్మిస్తారు?

14వ ఇంటర్ చేంజ్

గుంటూరు ప్రతిపాడు పర్చూరు రోడ్డులో పుల్లడిగుడ్డ ప్రాంతం వద్ద ఇక్కడ రోటరీ ఇంటర్ చేంజ్ నిర్మిస్తారు

గుంటూరు కి సమీపంలో ఉన్న పొత్తూ రు లింగాయపాలెం రోడ్డులో డబుల్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ నిర్మిస్తారు.

వైల్డ్ కార్డ్ ఎంట్రీలపైనే జగన్ ఆశలు



విశాఖపట్టణం, నెల్లూరు : వైసీపీలో వారసత్వ రాజకీయాలు జోరుగా సాగుతూ ఉంటాయి. జగన్ కూడా వైయస్ వారసుడే కాబట్టి.. పైగా ఆయన పేరు చెప్పుకునే పార్టీకి పేరు పెట్టుకున్నారు. వైయస్ పేరు లేకుంటే జగన్ కు ఈరోజుకు కూడా గుర్తింపు లేదు. ఎందుకంటే రాజశేఖర్ రెడ్డి వేసిన రాజకీయ పునాదులు అటువంటివి. జగన్ పార్టీలో కూడా వారసత్వ రాజకీయాలు జోరుగా సాగుతూ ఉంటాయి. అందువల్లే ఆ పార్టీలో ఉన్న నాయకులు తమ వారసులను లేదా బంధువులను.. ఇతర అనుచరులను రాజకీయాల్లోకి తీసుకొస్తూ ఉంటారు.ప్రస్తుతం ఏపీలో పురపాలక ఎన్నికలు జరగబోతున్నాయి. వైసిపి ఇప్పుడు అధికారం లేదు. అలాగని పూర్తిగా హ్యాండ్సప్ అవ్వకుండా.. గట్టిగా పోరాటం చేయాలని నేతలు నిర్ణయించుకున్నారు. అందువల్లే కీలకమైన నగర పాలకాలలో పోటీకి సై అంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. నాడు విశాఖపట్నం.. గుంటూరు.. నెల్లూరు నగర పాలకాలను వైసిపి దక్కించుకుంది. అయితే ఈసారి కూడా ఆ మూడు స్థానాల మీద గట్టిగా దృష్టి సారించినట్టు సమాచారం.. అందువల్లే ఈ మూడు కార్పొరేషన్లలో కొత్త పేర్లు తెరమీదకి వచ్చినట్టు ప్రచారం జరుగుతుంది.విశాఖపట్నంలో బొత్స సత్యనారాయణ కుమార్తె అనూష.. గుంటూరు నుంచి మాజీ మంత్రి అంబటి రాంబాబు కుమార్తె మౌనిక.. నెల్లూరు నుంచి మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత పేర్లు వినిపిస్తున్నాయి. విశాఖపట్నం వైసిపికి కీలకమైన రాజకీయ కేంద్రం. ఇక్కడ బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని పార్టీ అధిష్టానం భావిస్తోంది. పొలిటికల్గా యాక్టివ్ గా ఉన్న అనూషకు ఇటీవల భీమిలి సెగ్మెంట్ బాధితులు అప్పగించింది పార్టీ. వాస్తవానికి ఆమెను జిల్లా పరిషత్ కు పోటీ చేయించే ఆలోచనలో బొత్స ఉన్నారని చర్చ కూడా నడిచింది. ఆ తర్వాత రాజకీయ పరిణామాలు వేరే విధంగా మారిపోయాయి. దీంతో భీమిలి అనూష చేతికి సొంతమయ్యాయి. భీమిలిలో పార్టీని బలోపేతం చేస్తూనే.. విశాఖ మేయర్ పీఠం రేసులో అనూషను నిలబడితే ఎలా ఉంటుందనే ఆలోచన వైసీపీకి వచ్చినట్టు తెలుస్తోంది.ఇక గుంటూరు కార్పొరేషన్ విషయంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు కుమార్తె మౌనిక పేరు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. ఈమె తండ్రికి సపోర్ట్ గా నిలుస్తున్నారు. ఆమధ్య రాంబాబు కు సంబంధించిన కొన్ని వ్యవహారాలు చర్చకు దారి తీసినప్పుడు మౌనిక పొలిటికల్ స్క్రీన్ మీదకి వచ్చారు. నాడు ఆమె తండ్రికి సపోర్ట్ గా నిలిచారు. ఇక అధికార పక్షానికి గట్టిగానే కౌంటర్లు ఇచ్చారు. నాడు రాంబాబుకు సరైన వారసురాలు దొరికిందని రాజకీయవర్గాలలో చర్చ మొదలైంది. రాంబాబు ఆ మధ్య జైలుకు వెళ్లిన తర్వాత బెయిల్ మీద బయటకు వచ్చారు. ఆ తర్వాత మౌనిక అంతగా కనిపించలేదు. అయినా సరే ఆమెనే గుంటూరుకు దించితే బాగుంటుంది అని చర్చ నడుస్తోంది.నెల్లూరు కార్పొరేషన్ విషయానికొస్తే మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత పేరు వినిపిస్తోంది.



పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ

విధుల్లో పీపీఈ కిట్లు తప్పనిసరిగా ధరించాలి: కమిషనర్ గణేష్‌రెడ్డి

పట్టణ పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర కీలకం : చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన

గజ్వేల్: అక్టోబర్ 7 (ప్రజా కలం ప్రతినిధి):

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం రక్షణ సామగ్రిని పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన,కమిషనర్ పి.గణేష్‌రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్,కౌన్సిలర్ల సమక్షంలో కార్మికులకు పీపీఈ కిట్లు, ఖాకీ యూనిఫాంలు,తువ్వాళ్లు, సబ్బులు,నూనెలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్యం,సంక్షేమం కోసం మున్సిపాలిటీ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమిషనర్ పి.గణేష్‌రెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించే సమయంలో వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ప్రభుత్వం అందించిన పీపీఈ కిట్లను తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు. కార్మికుల భద్రత,పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని సబ్బులు,నూనెలు, యూనిఫాంలను క్రమం తప్పకుండా అందిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్,కౌన్సిల్ సభ్యులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రాయపోల్ నూతన ఎస్ఐగా బి.లింగం బాధ్యతల స్వీకరణ.

-శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి.

రాయపోల్ ఎస్ఐ బి.లింగం.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 07.

రాయపోల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బి.లింగం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట కమిషనరేట్ నుంచి రాయపోల్ ఎస్ఐగా బి.లింగం వచ్చారు. ఇప్పటి వరకు రాయపోల్ ఎస్ఐగా విధులు నిర్వహించిన కె.మానస హైదరాబాద్‌లోని సీఐడీ విభాగానికి డిప్యూటేషన్ పై వెళ్లారు. ఈ నేపథ్యంలో బి.లింగం రాయపోల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఐ బి.లింగం మాట్లాడుతూ రాయపోల్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని హెచ్చరించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజల భద్రతకు నిరంతరం అందుబాటులో ఉంటామని ఎస్ఐ బి.లింగం పేర్కొన్నారు.



బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నిజామాబాద్ సీపీ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 07:



తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య (ఐపీఎస్) బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బీసీ కమిషన్ చైర్మన్ జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక ఆర్ అండ్ బీ (R&B) అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆయనకు పుష్పాల మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ భేటీలో జిల్లాలోని ప్రస్తుత పరిస్థితులతో పాటు పలు అంశాలపై వారు కాసేపు ముచ్చటించారు.

విద్యుత్ కోసం రోడ్డెక్కిన రైతులు

24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్

గజ్వేల్: అక్టోబర్ 7 (ప్రజా కలం ప్రతినిధి):

విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలతో వ్యవసాయ పనులు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తూ గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్, దిలాల్‌పూర్,శేరిపల్లి గ్రామాల రైతులు బుధవారం అహ్మదీపూర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు.రైతుల ఆందోళనకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం విద్యుత్ కోతలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ అంతరాయాల కారణంగా సాగునీరు అందకపోతే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు.కనీసం 12 గంటల పాటు నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు.వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఇప్పటికే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,దీనికి తోడు విద్యుత్ సమస్య మరింత నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉందన్నారు. రైతుల ప్రయోజనం కోసం గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల నుంచి సాగునీటిని సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏఈ సత్యం ధర్నా వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో చర్చించి విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని మాదాసు శ్రీనివాస్ హెచ్చరించారు.కార్యక్రమంలో రైతు నాయకులు మద్ది రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి,రఘుపతిరెడ్డి, సర్పంచులు బ్యాగారి ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి,చాడా శ్రీనివాస్‌రెడ్డి,ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ

ఆరోగ్య పరిరక్షణకు పిపిఈ కిట్లు, యూనిఫాంలు అందజేత

గజ్వేల్: అక్టోబర్ 7 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ బుధవారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో 11వ వార్డు పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిగత రక్షణ పరికరాల (పిపిఈ) కిట్లు, ఖాకీ యూనిఫాంలు, తువ్వాళ్లు, సబ్బులు, నూనెలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన, మున్సిపల్ కమిషనర్ పి. గణేష్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ కొలిచెలిమి భవాని చేతుల మీదుగా వీటిని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతిరోజూ ప్రజారోగ్యం కోసం కష్టపడుతున్న వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు మున్సిపల్ పాలకవర్గం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో తప్పనిసరిగా పిపిఈ కిట్లు ధరించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. “ఆరోగ్యమే మహాభాగ్యం” అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ తాజా మాజీ సర్పంచ్ కొలిచేలిమి స్వామి,మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు పారిశుద్ధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గోల్డెన్ అవర్‌లో సమర్థవంతంగా స్పందించి రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడాలి

పోలీసులు , ఫైర్ సర్వీస్ , 108 , అంబులెన్స్ , ఆసుపత్రుల మధ్య సమన్వయం అత్యంత కీలకం పోలీస్ కమీషనర్ వెల్లడి

నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 07:



నిజామాబాదు పోలీస్ శాఖ సౌజన్యంతో సేవ్ లైఫ్ ఫౌండేషన్ మరియు వెర్టీస్ ఫౌండేషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో అవగాహన మరియు సమన్వయ కార్యక్రమం బుధవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్ యందు నిర్వహించడం జరిగింది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర వైద్య సహాయం అందించి , గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడే విధంగా అత్యవసర సేవల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి యస్.అన్నారు. సేవ్ లైఫ్ ఫౌండేషన్ మరియు వెర్టీస్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల జరిగిన సమయంలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు , బాధితులకు అందించాల్సిన ప్రాథమిక సహాయం , ప్రమాద స్థలం నుంచి ఆసుపత్రికి తరలించే ప్రక్రియ , వివిధ శాఖల మధ్య సమన్వయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ప్రతి నిమిషం ఎంతో విలువైనదని తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి సకాలంలో ప్రాథమిక వైద్యం అందించడం , వెంటనే అంబులెన్స్‌ను సమకూర్చడం , అవసరమైతే ఫైర్ సర్వీస్ సహాయంతో బాధితుడిని సురక్షితంగా బయటకు తీసుకురావడం , ఎలాంటి ఆలస్యం లేకుండా ఆసుపత్రికి తరలించడం వంటి చర్యలు సమన్వయంతో జరగాలని సూచించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించడం , ప్రమాదంలో చిక్కుకున్న వారికి సహాయం చేయడం , 108 మరియు ఇతర అంబులెన్స్ సేవలకు సమాచారం అందించడం వంటి చర్యలను వేగంగా చేపట్టాలని అన్నారు. అదేవిధంగా , తీవ్ర ప్రమాదాల్లో వాహనాల్లో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసుకురావడానికి ఫైర్ సర్వీస్ సిబ్బంది తక్షణమే స్పందించాలని , 108 అంబులెన్స్ సిబ్బంది అత్యవసర వైద్య సేవలు అందిస్తూ బాధితులను త్వరితగతిన ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఆసుపత్రుల యాజమాన్యాలు మరియు వైద్య సిబ్బంది కూడా రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ప్రమాద బాధితుడు ఆసుపత్రికి చేరుకునే సమయాన్ని తగ్గించేందుకు పోలీస్ శాఖ--108--ఫైర్ సర్వీస్--అంబులెన్స్--ఆసుపత్రుల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని సూచించారు. “ప్రతి నిమిషం ఒక ప్రాణాన్ని కాపాడగలదు” రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి గోల్డెన్ అవర్‌లో సరైన వైద్య సహాయం అందితే ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రమాదం జరిగిన వెంటనే స్పందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా ఆలస్యం ఉండకూడదని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ప్రమాద స్థలానికి అంబులెన్స్ చేరుకునే సమయం, బాధితుడిని వాహనం నుంచి బయటకు తీసే సమయం , ఆసుపత్రికి తరలించే సమయం వంటి ప్రతి దశను సమీక్షించి , అవసరమైన చోట మరింత మెరుగైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు “త్వరిత స్పందన -- సకాలంలో వైద్యం -- సమన్వయంతో తరలింపు -- ప్రాణ రక్షణ” అనే విధానంతో అన్ని అత్యవసర సేవల విభాగాలు సమిష్టిగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్.తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర సమయంలో వేగంగా సహాయం అందించడంతో పాటు , గోల్డెన్ అవర్‌ను సద్వినియోగం చేసుకుని విలువైన ప్రాణాలను కాపాడే విధంగా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని సంబంధిత విభాగాల మధ్య నమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాదు ఆదనపు డీసీపీ (అడ్మిన్)ఎన్. శుభం ప్రకాష్ , నిజామాబాదు ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ , సేవ్ లైఫ్ ఫౌండేషన్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ మహేష్ , సీఈవో పూష్ తివారి , మేనేజర్ నూర్ కేథర్ పాల్ , సిఓపి ఇలియానా , అసోసియేటెడ్ డైరెక్టర్ మల్లికార్జున్ , సి ఓ సి డాక్టర్ పుష్పందర్ కౌశిక్ , డిటిఓ రమేష్ రాథోడ్ , డి. ఎఫ్ ఓ పరమేశ్వర్ , 108 డైరెక్టర్ డాక్టర్ స్వరాజ్ , డి ఎం అండ్ హెచ్ ఓ ఆఫీసుకు సంబందించిన డాక్టర్లు సయ్యద్ అజ్మల్ డాక్టర్ సందీప్ , ఐ -రాడ్ మేనేజర్ శ్రీ వర్ష మరియు ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగింది.

“కైసర్ నగర్” అభివృద్ధిలో మరో ముందడుగు

కోటి ఇరవై లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 125 గాజులరామారం డివిజన్ కైసర్ నగర్ అభివృద్ధిలో మరో ముందడుగు పడింది. కోటి ఇరవై లక్షల రూపాయలతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు బుధవారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ శంకుస్థాపన చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మౌలిక వసతుల కల్పననే తమ మొదటి ప్రాధాన్యతనని, గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కైసర్ నగర్ లో భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా, సిసి రోడ్ల నిర్మాణము, వీధి దీపాల ఏర్పాటును చేపట్టారు. కైసర్ నగర్ అభివృద్ధిలో భాగంగా బుధవారం అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో కైసర్ నగర్ లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి అభివృద్ధి పరుస్తామన్నారు.అనంతరం సాయిబాబా నగర్, మంజూరు నగర్, సాబీర్ నగర్ లలో ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించి ప్రజలకు అందుతున్న వసతులు, చేపట్టవలసిన అభివృద్ధిపై ప్రజలతో ముఖాముఖి నిర్వహించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కైసర్ నగర్ లో....

కైసర్ నగర్ లో నిర్వహించిన సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ శంకుస్థాపన చేయగా కాలనీ వాసులు అజయ్ గుప్తా, మసూద్, మామి, నయీముద్దీన్, ఆసిఫ్, శ్రీనివాస్ యాదవ్, ఈశ్వర్ యాదవ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా నగర్ లో...

సాయిబాబానగర్ లో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాదయాత్ర నిర్వహించగా ఎమ్మెల్యే కాలనీ వాసులు సాయిబాబా, బాలరాజు, గంగాధర్, శ్రీనివాస్ గౌడ్, రాము, లక్ష్మీ, ఝాన్సీ, అంజనమ్మ, రాజా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాబేర్ నగర్ లో....

సాబేర్ నగర్ లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాదయాత్ర నిర్వహించగా ఎమ్మెల్యే గారితో పాటు కుర్షీదా ఆపా, ఇబ్రహీం ఖాన్, ఉదయ్ భావన్, మహమ్మద్ ఖాన్, వినోద్, కరీముద్దీన్, ఎండీ.అసన్, పింకీ, రవి, కుర్మయ్య, ఉస్మాన్, యూసుఫ్, ఆసిఫ్, బిందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈకార్యక్రమంలో ఏఈ కల్యాణ్, వాటర్ వర్క్స్ మేనేజర్ అనూష, విద్యుత్ ఏఈ భార్గవ్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్త

సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ రెడ్డి

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 7 ప్రజా కలం

విజ్ఞాన్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం ని చౌటుప్పల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ రెడ్డి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖ్ గ్రామంలో ఉన్న విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల విద్యార్థులకు సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా



మాట్లాడుతూ సైబర్ నేరాల వల్ల కలిగే నష్టాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోషల్ మీడియాను సురక్షితంగా వినియోగించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రత్యేకంగా OTP, PIN, CVV, ATM/బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు. గుర్తుతెలియని లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ ద్వారా వచ్చే అనుమానాస్పద సమాచారాన్ని నమ్మవద్దని తెలిపారు. అలాగే ఫేక్ సోషల్ మీడియా అకౌంట్లు, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, UPI/బ్యాంకింగ్ మోసాలు, ఫిషింగ్, సైబర్ బుల్లీయింగ్ తదితర సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరించారు.

సైబర్ మోసానికి గురైనప్పుడు భయపడకుండా వెంటనే సంబంధిత బ్యాంకుకు సమాచారం అందించి, 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి, తమ కుటుంబ సభ్యులు మరియు స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం, డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా వ్యవహరించడం గురించి విలువైన అవగాహన ప్రతి ఒక్కరికి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి ఉమెన్ సబ్ ఇన్స్పెక్టర్ లైలా, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, మురళీధర్ రెడ్డి, కానిస్టేబుల్ షరీఫ్, సాయి, సరస్వతి పాల్గొన్నారు.

మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప జన్మదిన వేడుకలు

అనాథ ఆశ్రమంలో ఘనంగా అన్నదానం

మహేశ్వరం, అక్టోబర్ 06 (ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మాతృదేవో భవ అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆశ్రమంలోని 100 మంది మానసిక వికలాంగులకు వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో రుచికరమైన భోజనాన్ని అందజేశారు. పుట్టినరోజు వేడుకలను హంగు, ఆర్భాటాలకు పోకుండా అభాగ్యుల మధ్య జరుపుకోవడం ఎంతో అభినందనీయమని, ఇది ఇతరులకు ఆదర్శమని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు బీరప్ప గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, వారి దాతృత్వాన్ని, సేవా గుణాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.



గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా నీలం మధు ముదిరాజ్ కు అవకాశం కల్పించాలి

- పేదల పెన్నిధి, ముదిరాజ్ మాణిక్యం నీలం మధు ముదిరాజ్ సేవలకు గుర్తింపు ఇవ్వాలి

- ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగూటి మహేందర్ ముదిరాజ్

మహేశ్వరం, అక్టోబర్ 06 (ప్రజా కలం ప్రతినిధి)

వచ్చే నెలలో గవర్నర్ కోటాలో ఖాళీ కాబోతున్న ఎమ్మెల్సీ పదవిని ముదిరాజ్ జాతి బిడ్డ, పేదల పెన్నిధి అయిన నీలం మధు ముదిరాజ్‌కి ఇచ్చి గౌరవించాలని ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగూటి మహేందర్ ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ జాతి జనాభా నిష్పత్తి, దామాషా ప్రకారం చూసినా ముదిరాజ్‌లకు రాజకీయ ప్రాతినిధ్యంలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజికవర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

కుల, మత, వర్గ, ప్రాంత భేదాలు లేని నాయకుడు నీలం మధు ముదిరాజ్:

నీలం మధు ముదిరాజ్ గారు కుల, మత, వర్గ, ప్రాంత భేదాలు లేకుండా, ఆపద అని ఎవరు తలుపు తట్టి ఇంటికి వచ్చినా ఖాళీ చేతులతో పంపించకుండా తనకు





తోచిన సహాయ సహకారాలు చేస్తున్న నిజమైన పేదల పెన్నిధి అని గదగూటి మహేందర్ ముదిరాజ్ కొనియాడారు. ముదిరాజ్ జాతిలో పుట్టి పెరిగిన మట్టిలో మాణిక్యం ఆయన అని అభివర్ణించారు.ఒక నిరుపేద కుటుంబంలో జన్మించిన అన్నగారికి మాత్రమే పేద కుటుంబాల్లో పుట్టిన వారి కష్టసుఖాలు అర్థమవుతాయని, అందుకే ఆయన నిరంతరం పేదల సంక్షేమం కోసం, సామాన్యుల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని తెలిపారు.

ప్రభుత్వం గౌరవించాలి:

అటువంటి నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, స్వయంకృషితో ఎదిగి, సమాజ సేవలో తనదైన ముద్ర వేసిన శ్రీ నీలం మధు ముదిరాజ్ అన్నగారిని వచ్చే నెలలో గవర్నర్ కోటాలో ఖాళీ కాబోతున్న ఎమ్మెల్సీగా నియమించి గౌరవించాలని, ముదిరాజ్ జాతికి తగిన రాజకీయ గుర్తింపు ఇవ్వాలని గదగూటి మహేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు.ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తే కేవలం ముదిరాజ్ జాతికే కాకుండా, పేద, బడుగు, బలహీన వర్గాలందరికీ న్యాయం జరుగుతుందని, వారి గొంతుక శాసన మండలిలో వినిపిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టేది?



అధికారులు ఎక్కడ?



- కొంపల్లిలో 'టౌన్ ప్లానింగ్' తీరుపై తీవ్ర ప్రశ్నలు..?

- కళ్లముందే అక్రమ నిర్మాణాలు.. అధికారుల మౌనం

- నిబంధనలు గాలికి.. బహుళ అంతస్తులు, అక్రమ షెడ్లు?

- కొంపల్లి మున్సిపల్ సర్కిల్--56లో టౌన్ ప్లానింగ్ తీరుపై తీవ్ర విమర్శలు



కుత్బుల్లాపూర్
అక్టోబర్ 7 (ప్రజా కలం ప్రతినిధి)


కొంపల్లి మున్సిపల్ సర్కిల్--56 పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నా యన్న ఆరోపణలు మున్సిపల్ యంత్రాంగం పనితీరుపై తీవ్ర ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు, అనుమతులకు భిన్నంగా షెడ్ల నిర్మాణాలు సాగుతున్నాయన్న ఫిర్యాదులు వినిపిస్తున్నా వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం నిశ్శబ్దం వీడకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల కళ్లముందే నిర్మాణాలు సాగుతున్నాయా? ఫిర్యాదులు అందుతున్నా ఎందుకు స్పందించడం లేదు? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు.అక్రమాలకు అడ్డుకట్ట ఎక్కడ? నిర్మాణ అనుమతులు పరిశీలించడం, సిఎంసి పరిధిలో టౌన్ ప్లానింగ్ నిబంధనలు అమలు చేయడం, ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడం మున్సిపల్ అధికారుల బాధ్యత. కాగా సర్కిల్--56 పరిధిలో కొన్ని నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయన్న ఆరోపించారు. క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణం పూర్తయ్యే వరకు పట్టించుకోకుండా.. ఆ తర్వాత చర్యల పేరుతో హడావుడి చేయడం అక్రమ నిర్మాణదారులకు మరింత ధైర్యం వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బహుళ అంతస్తులు షెడ్ల నిర్మాణాలు

కొంపల్లి నుంచి దూలపల్లి వెళ్లే మార్గంలో సెయింట్ మార్టిన్ కాలేజ్ సమీపంలో జరుగుతున్న షెడ్ నిర్మాణంపై స్థానికులు ప్రత్యేకంగా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ మేరకు ఉన్నాయి? నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా? అన్న వివరాలను మున్సిపల్ అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఇదే తరహాలో సూరారం మార్కెట్ రోడ్ లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనం అలాగే రామిరెడ్డి నగర్ లో బస్టాప్ సమీపంలో భారీ షెడ్ నిర్మించగా ఇటీవల సిఎంసి పాక్షికంగా కూలగొట్టింది. ఇదిలా జరిగిన మరుసటి రోజు నుండే భారీ షెడ్ నిర్మాణ పనులు యధావిధిగా కొనసాగుతున్నా కొంపల్లి మున్సిపల్ అధికారు మొక్కుబడిగా కూల్చినట్టు యాక్టింగ్ చేస్తున్నారా అన్నవిమర్శలు లేకపోలేదు. చూస్తూ ఊరుకుంటున్నారా? అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం స్పందించకపోవడం పై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. నిర్మాణాలు కనిపించవా? నిబంధనల ఉల్లంఘనలు తెలియవా? లేక తెలిసినా చర్యలు ఎందుకు లేవు? అనే ప్రశ్నలు అధికారుల తీరును ప్రశ్నిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందుతున్నప్పటికీ చర్యలు ఆలస్యం కావడానికి కారణమేంటో అధికారులు బహిరంగంగా వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణదారులకు కొందరు మున్సిపల్ సిబ్బంది అనధికారికంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు సైతం స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ లేదు. ఆరోపణల్లో వాస్తవమెంత? ఎవరి పాత్ర ఉంది? నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు సాగుతుంటే అధికారులు ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు.

మౌనం వీడుతారా.. చర్యలు తీసుకుంటారా?

కొంపల్లి మున్సిపల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల ఆరోపణలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అనుమతులు--నిర్మాణాల వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే సంబంధిత నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మౌనం వీడి అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తారా? లేక ఫిర్యాదులు, ఆరోపణలు అలాగే ఫైళ్లకే పరిమితం అవుతాయా? అన్నది వేచి చూడాల్సి ఉంది.



ఓపెన్ నాలాకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

బాక్స్ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 06 (ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ 57వ డివిజన్ అల్మాస్‌గూడ పరిధిలోని సౌభాగ్య లక్ష్మీ నగర్ కాలనీ నుంచి పోచమ్మ కుంట వరకు ఉన్న ఓపెన్ నాలాపై బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఓపెన్ నాలా కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దుర్గంధం, దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ఈ బాక్స్ డ్రైన్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు.

బాక్స్ డ్రైన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ బాక్స్ డ్రైన్ నిర్మాణంతో ఓపెన్ నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు, పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్లు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, కాలనీవాసులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com